VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 09.08.2026

సంపుటి : 09 సంచిక : 61 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com





# విద్యార్థులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

- ఇండీ కూటమిపై బీజేపీ నేత విమర్శలు

హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:

జార్ఖండ్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ఎందుకు స్పందించడం లేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మాత్రమే కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు తమ హక్కుల కోసం ఆందోళనలు చేస్తున్నా.. కాంగ్రెస్, ఇండీ కూటమి నేతలు తమకు అనుకూలమైన అంశాలపైనే మాట్లాడుతున్నారని విమర్శించారు.జాతీయ మీడియాతో మాట్లాడిన రాంచందర్‌రావు.. జార్ఖండ్‌లో విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. అయినా అక్కడి పరిస్థితిపై కాంగ్రెస్ నాయకులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. విద్యార్థుల సమస్యలపై నిజంగా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే జార్ఖండ్ ఆందోళనలపైనా మాట్లాడాలని డిమాండ్ చేశారు.కేరళలో కూడా విద్యార్థులు తమ హక్కుల కోసం ఉద్యమిస్తున్నారని రాంచందర్‌రావు పేర్కొన్నారు. అయితే ఈ అంశాలు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలో చోటు చేసుకునే పరిణామాలను మాత్రం రాజకీయంగా ఉపయోగించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.విద్యార్థుల సమస్యలను సమానంగా చూడకుండా ప్రాంతం, రాజకీయ పరిస్థితుల ఆధారంగా స్పందించడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని రాంచందర్‌రావు విమర్శించారు. విద్యార్థులను వారి హక్కుల కోసం అండగా నిలిచేందుకు కాకుండా.. రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్, ఇండీ కూటమి వ్యవహారశైలిలో కపటత్వం కనిపిస్తోందని అన్నారు.ఇదే సమయంలో విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) బిల్లుపై ఇతర దేశాల నుంచి వస్తున్న వ్యాఖ్యలపైనా రాంచందర్‌రావు తీవ్రంగా స్పందించారు. భారతదేశ చట్టాలు, విధానాలపై అమెరికా సహా ఇతర దేశాలు జోక్యం చేసుకోవడం సరికాదని అన్నారు. ఎఫ్‌సీఆర్ఏకు సంబంధించిన నిర్ణయాలు పూర్తిగా భారతదేశ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేశారు.భారత్ తన చట్టాలను రూపొందించుకునే విషయంలో ఎలాంటి విదేశీ జోక్యాన్ని అంగీకరించాల్సిన అవసరం లేదని రాంచందర్‌రావు అన్నారు. భారత అంతర్గత వ్యవహారాలపై ఇతర దేశాలు వ్యాఖ్యానించడం దేశ సార్వభౌమాధికారాన్ని ప్రశ్నించడమే అవుతుందని పేర్కొన్నారు. భారత చట్టాల విషయంలో ఇతర దేశాలు పరిమితులను గౌరవించాలని ఆయన సూచించారు.

# మహిళలకు బీజేపీ అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ మహిళలకు రాజకీయంగా ఉన్నత అవకాశాలు కల్పించిందని పొంగులేటి అన్నారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతి, తొలి మహిళా ప్రధానిని అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. పార్టీ అధ్యక్ష పదవితో పాటు కీలక నాయకత్వ బాధ్యతలను కూడా మహిళలకు అప్పగించిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని పేర్కొన్నారు.మహిళలపై వేధింపులకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల విషయంలోనూ ఆ పార్టీ తీరును మంత్రి ప్రశ్నించారు. తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినప్పటికీ సంబంధిత నేతలపై తగిన చర్యలు తీసుకోకుండా రాజకీయంగా రక్షిస్తున్నారని ఆరోపించారు. మహిళల భద్రత గురించి మాట్లాడే ముందు ఆ పార్టీ తన వ్యవహారశైలిని సమీక్షించుకోవాలని సూచించారు.మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించే అంశంపైనా పొంగులేటి బీజేపీని నిలదీశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకుండా నియోజకవర్గాల పునర్విభజనను కారణంగా చూపుతూ జాప్యం చేస్తున్నారని విమర్శించారు. మహిళల రాజకీయ సాధికారతను ముందుకు తీసుకెళ్లాల్సిన సమయంలో డీలిమిటేషన్ అంశాన్ని అడ్డంకిగా చూపడం సరికాదన్నారు.మహిళా రిజర్వేషన్ అమలును నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టకుండా.. రెండింటినీ వేర్వేరు అంశాలుగా చూడాలని పొంగులేటి డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు, సాకులు లేకుండా మహిళలకు చట్టసభల్లో వారికి దక్కాల్సిన ప్రాతినిధ్యాన్ని వెంటనే కల్పించాలని కోరారు. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని మంత్రి సూచించారు.

# ప్రతి వాన చుక్కను ఒడిసిపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్షపాతం పరిస్థితులతో పాటు భూగర్భ జలాల లభ్యతపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి వృథాను అరికట్టి.. అందుబాటులోకి వచ్చే ప్రతి నీటి బొట్టును భవిష్యత్ అవసరాల కోసం ఒడిసిపట్టేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.జలసిరి, ఫార్మ్ పాండ్స్ వంటి నీటి సంరక్షణ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టి భూగర్భ జలాలను పెంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నీటి నిల్వ నిర్మాణాలను పెంచాలని ఆదేశించారు.మున్సిపాలిటీల పరిధిలో కొత్తగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే సమయంలో ఇంకుడు గుంత ఏర్పాటు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు ఇది దోహదపడుతుందని అన్నారు.అలాగే నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణకు సంబంధించిన వాల్టా (WALTA) చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ, మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మీ నిర్ణయాలే వికసిత్ భారత్‌కు బాట

(మొదటి పేజీ తరువాయి)



దాని వల్ల దేశానికి ఏ విధంగా ప్రయోజనం కలుగుతుందో ఆలోచించాలని సూచించారు. 'దేశ ప్రయోజనాల కోసం మనం ఏం చేయగలం?' అనే ప్రశ్నను ప్రతి ఒక్కరూ తమను తాము వేసుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు.

### మహిళల సంఖ్య పెరగాలి

స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను మోదీ ప్రదానం చేశారు. పతకాలు అందుకున్న వారిలో ఒకరిద్దరు మాత్రమే మహిళలు ఉండటాన్ని ప్రస్తావించిన ఆయన.. భవిష్యత్తులో అవార్డులు అందుకునే మహిళా విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రం పరం ప్రజ్ఞ'ను మోదీ ప్రారంభించారు. ఆధునిక సాంకేతికత, పరిశోధన రంగాల్లో దేశ సామర్థ్యాలను మరింత పెంచేందుకు ఇటువంటి మౌలిక వసతులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

# బీసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 08, 2026:

హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. బీసీల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, రాబోయే విగ్రహావిష్కరణ కార్యక్రమాలు, బీసీ వర్గాల అభ్యున్నతికి తీసుకోవాల్సిన తదుపరి కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.సమావేశంలో హైదరాబాద్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ పక్కన ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఈ నెల 14వ తేదీన ప్రారంభించేందుకు నిర్ణయించారు.

అలాగే ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాలను ఈ నెల 18వ తేదీన ప్రారంభించే కార్యక్రమంపై చర్చించారు.విగ్రహావిష్కరణ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు కలిసి ఆహ్వానించాలని సమావేశంలో నిర్ణయించారు.

ముఖ్యమంత్రిని కలిసి బీసీ వర్గాల సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా చర్చించాలని నిర్ణయించారు.

### పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభను ఘనంగా నిర్వహించాలి

మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు, బీసీ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది. పూలే దంపతుల ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు.

### బీసీ కులగణనపై తదుపరి కార్యాచరణ

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టినప్పటికీ, బీసీ వర్గాల ఆకాంక్షలు, లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదనే అభిప్రాయంతో తదుపరి కార్యాచరణపై ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతికి బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించే అంశంపై కృషి చేయాలని నిర్ణయించారు. అలాగే బీసీ కమిషన్‌ను మరింత బలోపేతం చేసి, బీసీల సమస్యల పరిష్కారంలో కమిషన్‌కు అవసరమైన సహకారం అందించాలని చర్చించారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రజా పాలన ప్రభుత్వం కొనసాగిస్తోందని సమావేశంలో పేర్కొన్నారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడతల వారీగా విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

### బీసీ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేరాలి

బీసీ సంక్షేమ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. బీసీ వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా బీసీ సంక్షేమ శాఖకు అవసరమైన నిధులు కేటాయించి, సంక్షేమం, ఉపాధి, ఆర్థిక సాధికారతకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.




### ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి వేగం

రాష్ట్రంలోని వివిధ బీసీ కుల సంఘాలకు సంబంధించిన ఆత్మగౌరవ భవనాలకు సాధ్యమైనంత త్వరగా నిధులు కేటాయించి, నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.అదేవిధంగా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు నిర్ణయించారు.బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలోని బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు.సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, నవీన్ యాదవ్, ఈర్లపల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# 150 పోస్టులకే వేల మంది క్యూ

- ఉద్యోగం కోసం రావడం తప్పా.. ఉద్యోగాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ తప్పా?
- విద్యార్థులు, నిరుద్యోగులపై ప్రభుత్వానికి ఎందుకింత కక్ష?: హరీశ్‌రావు

హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:

హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం వచ్చిన నిరుద్యోగులను అవమానించారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే దుర్భాషలాడటం బాధాకరమని పేర్కొన్నారు. నిరుద్యోగులను అవమానించిన ఘటనపై ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. విద్యార్థులు, నిరుద్యోగులంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు ఉద్యోగాల కోసం యువత రోడ్లపైకి వస్తే వారిపట్ల కర్కశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

### 150 పోస్టులకు వేలాదిగా నిరుద్యోగులు

హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ వెలువడితేనే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారని హరీశ్‌రావు పేర్కొన్నారు. భారీ సంఖ్యలో యువత రావడం వారి తప్పా? లేక ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవడం తప్పా? అని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం వచ్చిన యువతను అవమానించడం సరికాదని.. వారితో గౌరవంగా వ్యవహరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.

### రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. 32 నెలలు దాటినా ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? అని ప్రశ్నించారు.

### జాబ్ క్యాలెండర్ బోగస్

రెండు లక్షల ఉద్యోగాల హామీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ పాలనపై యువతలో నిరాశ పెరుగుతోందని ఆరోపించారు. సక్రమంగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత సైతం చిన్నచిన్న పోస్టులకు పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

నిరుద్యోగులు ప్రభుత్వాన్ని జాలి అడగడం లేదని.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నారని హరీశ్‌రావు అన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ అండ

- పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి
- సీనియర్లతో చర్చించి కేసీఆర్ నిర్ణయం
- దశదినకర్మల తర్వాత తదుపరి చర్యలు
- ఎల్లకాలం కుటుంబానికి అండగా ఉంటాం

హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలవాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఆయన కుటుంబానికి మొత్తం రూ.2.25 కోట్ల ఆర్థికసాయం అందించాలని పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఆర్థికసాయం అందించాలని నిర్ణయించారు. పిల్లల భవిష్యత్తు, విద్య, ఇతర అవసరాలకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకునేలా చేయనున్నారు. కుటుంబానికి భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు.అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున ఆమె బాగోగుల కోసం ప్రత్యేకంగా రూ.25 లక్షలు బ్యాంకులో ఆమె పేరు మీద జమ చేయాలని నిర్ణయించారు. తద్వారా మొత్తం రూ.2.25 కోట్లను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థికసాయంగా అందించనుంది.ఇంతటితో పార్టీ బాధ్యత ముగిసిపోదని కేసీఆర్ స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువులు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని తెలిపారు. కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పార్టీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.<

పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వరంగల్ జిల్లా పార్టీ ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించి మరిన్ని నిర్ణయాలు తీసుకుంటారని కేసీఆర్ తెలిపారు. దివంగత మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి బీఆర్ఎస్ ఎల్లకాలం అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు.


# దోమల నివారణకు ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)

దోమల నివారణకు ఉపయోగిస్తున్న వివిధ పరికరాలను మంత్రి పరిశీలించి, వాటి వినియోగం, పనితీరు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### దోమల నివారణకు విస్తృత చర్యలు

దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపడుతున్నారు.ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమం నిర్వహించడం.ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించడం.దోమల లార్వాలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించడం.జీహెచ్ఎంసీ పరిధిలో విస్తృతంగా ఫాగింగ్ నిర్వహించడం.దోమల నివారణపై కరపత్రాలను పంపిణీ చేయడం.పాఠశాలల్లో విద్యార్థులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం.ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు సూచనలు చేయడం.ప్రజలు స్వీయ బాధ్యతతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ ద్వారా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ప్రజలందరూ స్వీయ బాధ్యతతో తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఇళ్లలో, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల లార్వాలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని, ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించి తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని మంత్రి అన్నారు.ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే హైదరాబాద్ ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు.వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని మంత్రి స్పష్టం చేశారు.జీహెచ్ఎంసీ చేస్తున్న విజ్ఞప్తిని




ప్రతి ఒక్కరూ పాటించి దోమల నివారణలో భాగస్వాములు కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

ఇంటింటికీ IEC కార్యక్రమం: డా. అమర్ సింగ్ నాయక్,చీఫ్ మెడికల్ ఆఫీసర్

జీహెచ్ఎంసీ పరిధిలో 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి IEC (Information, Education and Communication) కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. అమర్ సింగ్ నాయక్ తెలిపారు. దోమలను ఎలా నియంత్రించాలి, డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమం ద్వారా దోమల లార్వాలను గుర్తించి, అవి పెరిగే అవకాశం ఉన్న నీటి నిల్వలను తొలగించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అక్కడక్కడా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను ప్రజలు వెంటనే గుర్తించి తొలగించాలని కోరారు. ఇళ్ల పరిసరాల్లో దోమల లార్వాలు కనిపిస్తే వాటిని గుర్తించి, ఆ నీటిని బయటకు పారబోయాలని సూచించారు.కార్యక్రమంలో ఎంటమాలజీ, శానిటేషన్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 09.08.2026
సంపుటి : 09 సంచిక : 61 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



## బీసీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి

- మహాత్మా జ్యోతిబాపూలే దంపతులు 14 వ తేదీ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 18 వ తేదీ జరిగే విగ్రహావిష్కరణల సభలు విజయవంతం చేసేలా ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలు పాల్గొనాలి

# మీ నిర్ణయాలే వికసిత్ భారత్‌కు బాట

- యువతకు మోదీ దిశానిర్దేశం.. యువత సామర్థ్యాలపై పూర్తి విశ్వాసం ఉందన్న మోదీ
- దేశ అభివృద్ధిలో యువత కీలక భాగస్వామి కావాలని పిలుపు
- రాబోయే 30-35 ఏళ్లలో యువత పాత్రే నిర్ణాయకమని వ్యాఖ్య
- మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నేర్చుకోవాలని సూచన
- 20-30 ఏళ్లలో ఎలాంటి మార్పులు వస్తాయో చెప్పలేమని వ్యాఖ్య
- సవాళ్లకు భయపడకుండా పరిష్కారాలపై దృష్టిపెట్టాలని హితవు



**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**

దేశ యువత సామర్థ్యాలపై తనకు ఎంతో నమ్మకం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి తరానికి దేశం పట్ల బాధ్యత ఉంటుందని.. రాబోయే 30–35 ఏళ్లలో యువత చేసే కృషి దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని తెలిపారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోదీ.. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చదువు పూర్తిచేసుకుని వృత్తి జీవితంలోకి అడుగుపెడుతున్న యువత.. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు.

### ఎప్పుడూ 'నిత్య విద్యార్థి'గా ఉండాలి

సాంకేతికతతో పాటు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని మోదీ అన్నారు. రాబోయే 20–30 ఏళ్లలో ప్రపంచం ఎలా మారుతుందో ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదని పేర్కొన్నారు. అందువల్ల జీవితంలో ఎప్పుడూ కుతూహలాన్ని కొనసాగించాలని, కొత్త విషయాలను నేర్చుకోవడం ఆపకూడదని విద్యార్థులకు సూచించారు. నిరంతరం నేర్చుకునే వ్యక్తులే మారుతున్న పరిస్థితుల్లో విజయవంతంగా నిలుస్తారని అన్నారు.

### సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి

జీవితంలో ఎదురయ్యే సమస్యలను చూసి భయపడాల్సిన అవసరం లేదని ప్రధాని చెప్పారు. పెద్ద సవాలు ఎదురైనప్పుడు దాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించి ఒక్కొక్క సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేయాలని సూచించారు. కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యమే సవాళ్లను అవకాశాలుగా మార్చగలదని అన్నారు. సమస్యలను ప్రశ్నించడం దగ్గరే ఆగిపోకుండా.. వాటికి పరిష్కారాలు కనుగొనడంపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు హితవు పలికారు.

### దేశానికి ఏం చేయగలం?

ప్రతి తరానికీ జాతీయ బాధ్యత ఉంటుందని మోదీ గుర్తుచేశారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాబోయే 30–35 ఏళ్లలో యువత ఏం చేస్తుందనేదే వికసిత్ భారత్ నిర్మాణాన్ని నిర్ణయిస్తుందని అన్నారు. వ్యక్తిగత జీవితంలో ఏ నిర్ణయం తీసుకున్నా..

▶ మిగతా 2లో

# విద్యార్థులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్‌రావు ఫైర్
- జార్ఖండ్ విద్యార్థులపై కాంగ్రెస్ మౌనమెందుకు
- కేరళలోనూ విద్యార్థుల పోరాటాలు కనిపించవా?
- ఢిల్లీ అంశాలకే రాజకీయ ప్రాధాన్యమా..



- విద్యార్థులను రాజకీయాలకు వాడు కుంటున్నారని ఆరోపణ

# దోమల నివారణకు ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్

- ప్రతి శుక్రవారం 'ఫ్రైడే–డ్రైడే' పాటించాలి
- ఆగస్టు 11 నుంచి 21 వరకు స్పెషల్ మాన్సూన్ డ్రైవ్ లో భాగంగా IEC(ఇన్ఫర్మేషన్ , ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) కార్యక్రమం ప్రారంభం - మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 08, 2026:**

హైదరాబాద్ నగరంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆగస్టు 11 నుంచి 21వ తేదీ వరకు చేపట్టనున్న స్పెషల్ మాన్సూన్ డ్రైవ్లో భాగంగా దోమల నివారణకు చేపట్టనున్న చర్యలపై మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా IEC కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంటమాలజీ విభాగం అధికారులు దోమల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించారు.



# మహిళలకు బీజేపీ అన్యాయం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపణ
- బీజేపీపై మంత్రి పొంగులేటి విమర్శలు
- మహిళా అధ్యక్షురాలిని నియమించలేదని ఆరోపణ
- కాంగ్రెస్ మహిళలకు ఉన్నత పదవులు ఇచ్చిందని వ్యాఖ్య
- మహిళా నేతలపై వేధింపుల ఆరోపణలు పట్టించుకోలేదని విమర్శ
- రిజర్వేషన్ అమలులో జాప్యంపై మండిపాటు



**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**

భద్రత నుంచి రాజకీయ ప్రాతినిధ్యం వరకు మహిళల విషయంలో బీజేపీ అన్యాయంగా వ్యవహరిస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మహిళా సాధికారతపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆరోపిస్తూ సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు. బీజేపీ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఇప్పటివరకు ఒక మహిళను కూడా జాతీయ అధ్యక్షురాలిగా నియమించ లేదని పేర్కొన్నారు.

# ప్రతి వాన చుక్కను ఒడిసిపట్టాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి
- ఎల్‌నినో పరిస్థితులపై అధికారులతో సమీక్ష
- జలసిరి, ఫార్మ్ పాండ్ల నిర్మాణానికి ప్రాధాన్యం
- ఇంకుడు గుంత తప్పనిసరి చేయాలి
- వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**

నల్గొండ జిల్లాలో వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొని పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.

# 150 పోస్టులకే వేల మంది క్యూ




- నిరుద్యోగులను అవమానిస్తారా?: హరీశ్‌రావు
- హైడ్రా డ్రైవర్ ఉద్యోగాల దరఖాస్తులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆగ్రహం
- నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం బాధాకరం

# గౌలిగూడ శ్రీ మహంకాళి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాల సమర్పణ చేయనున్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 8:**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆగస్టు 9న గౌలిగూడలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ సలహాదారు (ప్రజా సంబంధాలు & ప్రోటోకాల్) హర్కర వేణుగోపాల్ రావు గారు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.బోనాల ఉత్సవాలు తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంప్రదాయాలకు అద్దం పట్టే మహోత్సవాలని, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.



# ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు



- మంత్రి జూపల్లి కృష్ణారావు
- రాజకీయ పబ్బం కోసమే విమర్శలని ఆరోపణ
- నీటిని పొదుపుగా వాడాల్సిన బాధ్యత

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి కేసీఆర్ అండ


- రూ.2.25 కోట్ల సాయం
- ఇద్దరు పిల్లలకు చెరో కోటి సాయం
- తల్లి అమృతమ్మకు రూ.25 లక్షలు
- కుటుంబ సంక్షేమానికి పార్టీ భరోసా



# భారత స్వాతంత్ర్య సంగ్రామంలో క్విట్ ఇండియా ఉద్యమం ఒక మహత్తర మైలురాయి

## మహాత్మా గాంధీ నాయకత్వంలో యావత్ భారతాన్ని ఏకం చేసిన 'భారత్ విడిచి వెళ్లండి' ఉద్యమం

భారతదేశ స్వాతంత్ర్య చరిత్రలో 1942 ఆగస్టు 8వ తేదీకి ఒక ప్రత్యేకమైన, చిరస్మరణీయమైన స్థానం ఉంది. బ్రిటిష్ వలస పాలకుల దుర్మార్గపు పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడానికి మహాత్మా గాంధీ నాయకత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ ఇచ్చిన చారిత్రాత్మక పిలుపే 'క్విట్ ఇండియా ఉద్యమం' – 'భారత్ విడిచి వెళ్లండి ఉద్యమం'. ఈ ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటాన్ని తుది దశకు తీసుకెళ్లిన మహత్తర ప్రజా ఉద్యమంగా చరిత్రలో నిలిచిపోయింది.రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం భారత ప్రజల అభిప్రాయాన్ని, భారత జాతీయ కాంగ్రెస్‌ను సంప్రదించకుండానే భారతదేశాన్ని యుద్ధంలోకి నెట్టింది. బ్రిటిష్ పాలకులు భారతీయుల స్వేచ్ఛను నిరాకరిస్తూనే, తమ సామ్రాజ్య ప్రయోజనాల కోసం భారత ప్రజల వనరులను, సైనిక శక్తిని వినియోగించుకోవాలని ప్రయత్నించారు. ఈ పరిస్థితుల్లో భారతదేశానికి తక్షణ స్వాతంత్ర్యం ఇవ్వాలని కాంగ్రెస్ స్పష్టంగా డిమాండ్ చేసింది.1942లో బ్రిటిష్ ప్రభుత్వం భారతీయుల సహకారం పొందేందుకు సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో క్రిప్స్ మిషన్‌ను భారత్‌కు పంపింది. అయితే ఆ ప్రతిపాదనలు భారతదేశానికి తక్షణ స్వాతంత్ర్యం లేదా అధికార బదలాయింపును ఇవ్వకుండా, యుద్ధం అనంతరం భవిష్యత్తులో కొన్ని హామీలను మాత్రమే సూచించాయి. భారత జాతీయ కాంగ్రెస్ ఆ ప్రతిపాదనలను తిరస్కరించింది. క్రిప్స్ మిషన్ వైఫల్యం తర్వాత దేశంలో బ్రిటిష్ పాలనపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. (Amrit Mahotsav )ఈ నేపథ్యంలో 1942 జూలై 14న వార్ధాలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బ్రిటిష్ వారు భారతదేశం నుంచి వైదొలగాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. అవసరమైతే అహింసా మార్గంలో సామూహిక ప్రజా ఉద్యమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. మహాత్మా గాంధీజీ ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేశారు. (Gandhi Heritage Portal )



**ఆగస్టు 8 – చరిత్రను మార్చిన రోజు**

1942 ఆగస్టు 8న బొంబాయిలోని అప్పటి గోవాలియా ట్యాంక్ మైదానంలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో 'క్విట్ ఇండియా' తీర్మానం ఆమోదించబడింది. నేడు ఆ ప్రదేశాన్ని ఆగస్టు క్రాంతి మైదాన్గా పిలుస్తున్నారు.

ఆ చారిత్రాత్మక సభలో మహాత్మా గాంధీజీ దేశ ప్రజలకు ఇచ్చిన పిలుపు భారత స్వాతంత్ర్య పోరాటానికి కొత్త దిశను ఇచ్చింది.

**"చేయండి లేదా చావండి – Do or Die"**

అనే గాంధీజీ పిలుపు కోట్లాది భారతీయుల హృదయాల్లో స్వాతంత్ర్య జ్వాలను మరింత రగిలించింది. బ్రిటిష్ పాలకులకు మాత్రం ఆయన సందేశం స్పష్టంగా ఉంది – భారతదేశాన్ని విడిచి వెళ్లండి.గాంధీజీ ఉద్దేశం హింసాత్మక పోరాటం కాదు. అహింస, సత్యాగ్రహం, ప్రజా శక్తి ఆధారంగా బ్రిటిష్ పాలనను భారతదేశం నుంచి తొలగించడం. ప్రజలే ఈ పోరాటానికి అసలైన శక్తి అని ఆయన విశ్వసించారు. భారత స్వాతంత్ర్యం ఇక వాయిదా వేయలేని జాతీయ హక్కు అని ఆయన స్పష్టం చేశారు. (Amrit Mahotsav )

**నాయకులను అరెస్టు చేసినా ఉద్యమాన్ని ఆపలేకపోయారు**

క్విట్ ఇండియా ఉద్యమం పిలుపు ఇచ్చిన వెంటనే బ్రిటిష్ ప్రభుత్వం భయభ్రాంతులకు గురైంది. ఆగస్టు 9వ తేదీ తెల్లవారుజామునే మహాత్మా గాంధీజీతో పాటు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఆచార్య జె.బి. కృపలానీ తదితర అగ్ర కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులలో పలువురిని కూడా నిర్బంధించింది. గాంధీజీని ఆగాఖాన్ ప్యాలెస్‌లో నిర్బంధించగా, పలువురు కాంగ్రెస్ నాయకులను అహ్మద్‌నగర్ కోటలో నిర్బంధించారు. (Gandhi Heritage Portal )

బ్రిటిష్ పాలకులు ఒక విషయం అర్థం చేసుకోలేకపోయారు. వారు నాయకులను జైళ్లలో పెట్టగలిగారు కానీ ప్రజల గుండెల్లో వెలిగిన స్వాతంత్ర్య జ్వాలను మాత్రం ఆర్పలేకపోయారు.

అగ్ర నాయకత్వాన్ని అరెస్టు చేసినప్పటికీ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థులు, యువత, మహిళలు, కార్మికులు, రైతులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు పెద్ద సంఖ్యలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు.

**మహిళల పాత్ర – అరుణా అసఫ్ అలీ ధైర్యం**

క్విట్ ఇండియా ఉద్యమంలో మహిళల పాత్ర కూడా చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది. ఆగస్టు 9న గాంధీజీ, ఇతర కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసినప్పటికీ అరుణా అసఫ్ అలీ గోవాలియా ట్యాంక్ మైదానానికి చేరుకుని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆమె ధైర్యం ఉద్యమంలో పాల్గొన్న ప్రజలకు అపారమైన స్ఫూర్తినిచ్చింది. (Amrit Mahotsav )

అదేవిధంగా సుచేతా కృపలానీ, ఉషా మెహతా, సరోజినీ నాయుడు వంటి మహిళా నాయకులు తమదైన రీతిలో స్వాతంత్ర్య ఉద్యమానికి సేవలందించారు. ముఖ్యంగా ఉషా మెహతా నిర్వహించిన రహస్య కాంగ్రెస్ రేడియో బ్రిటిష్ సెన్సార్‌ను ధిక్కరిస్తూ ఉద్యమ వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించింది.

**భూగర్భ ఉద్యమం – ప్రజలే ఉద్యమానికి నాయకత్వం**

బ్రిటిష్ ప్రభుత్వం పత్రికలపై ఆంక్షలు విధించింది. సమావేశాలను నిషేధించింది. కాంగ్రెస్ సంస్థపై నిర్బంధాలు విధించింది. వేలాది మందిని అరెస్టు చేసింది. అయినప్పటికీ ఉద్యమం ఆగలేదు.

జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, అచ్యుత్ పట్వర్ధన్ తదితరులు భూగర్భ కార్యకలాపాల ద్వారా ఉద్యమాన్ని కొనసాగించారు. రహస్య ప్రచురణలు, రహస్య సమావేశాలు, సమాచార వ్యవస్థల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య భావనను సజీవంగా ఉంచారు. 1942లో కాంగ్రెస్ కార్యకర్తలు రూపొందించిన రహస్య ప్రచార పత్రాలు దేశంలోని అనేక ప్రాంతాలకు చేరాయి. (Amrit Mahotsav )

కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యామ్నాయ పరిపాలనా వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్లియాలో చిట్టూ పాండే నాయకత్వంలో కొద్దికాలం ప్రత్యామ్నాయ జాతీయ ప్రభుత్వం ఏర్పడటం ప్రజా ప్రతిఘటనకు ఉదాహరణగా నిలిచింది. (Amrit Mahotsav )

**ఆంధ్రప్రదేశ్‌లోనూ క్విట్ ఇండియా ఉద్యమం ఉధృతం**

క్విట్ ఇండియా ఉద్యమ ప్రభావం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోనూ బలంగా కనిపించింది. గుంటూరు ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలను సమీకరించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. టెనాలి ప్రాంతంలో జరిగిన నిరసనల్లో స్వాతంత్ర్య సమరయోధులు ప్రాణత్యాగం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కాల్పులు జరిపి ఉద్యమకారులను అణచివేయడానికి ప్రయత్నించింది. (Amrit Mahotsav )

తూర్పు గోదావరి జిల్లాలో రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుల అరెస్టులకు నిరసనగా ప్రజలు హర్తాళ్లు, సమావేశాలు నిర్వహించారు. (Amrit Mahotsav )

కృష్ణా జిల్లాలో విద్యార్థులు కూడా క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఉద్యమంలో పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజలను స్వాతంత్ర్య పోరాటం వైపు నడిపించారు. (Amrit Mahotsav )

**కాంగ్రెస్ పార్టీ – స్వాతంత్ర్య పోరాటానికి ప్రధాన రాజకీయ వేదిక**

క్విట్ ఇండియా ఉద్యమం ఒకరోజు జరిగిన నిరసన కార్యక్రమం కాదు. అది దశాబ్దాలుగా భారత జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొనసాగిన స్వాతంత్ర్య పోరాటానికి తుది దశలో వచ్చిన మహత్తర ప్రజా విస్ఫోటనం.అసహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, సివిల్ డిస్‌ఓబీడియెన్స్ ఉద్యమం వంటి పోరాటాల ద్వారా కాంగ్రెస్ ప్రజలను రాజకీయంగా చైతన్య పరిచింది. అదే ప్రజా చైతన్యం 1942లో క్విట్ ఇండియా ఉద్యమంగా మహా శక్తిగా మారింది.కాంగ్రెస్ అగ్ర నాయకత్వాన్ని జైలులో పెట్టినప్పటికీ, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ఉద్యమాన్ని కొనసాగించారు. వేలాది మంది కార్యకర్తలు అరెస్టయ్యారు. అనేకమంది లాఠీచార్జీలు, జైలు శిక్షలు, పోలీసు కాల్పులను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ స్వాతంత్ర్య లక్ష్యం నుంచి వెనక్కి తగ్గలేదు.

**ప్రజల అపూర్వమైన మద్దతు**

క్విట్ ఇండియా ఉద్యమం యొక్క గొప్పతనం ఏమిటంటే ఇది కేవలం నాయకుల ఉద్యమంగా మిగలలేదు. ఇది ప్రజల ఉద్యమంగా మారింది.దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చారు. విద్యార్థులు ఉద్యమించారు. మహిళలు ముందుండి పోరాడారు. రైతులు, కార్మికులు, యువత, సామాన్య ప్రజలు తమ వంతు పాత్ర పోషించారు.

కొన్ని ప్రాంతాల్లో నిరసనలు హింసాత్మక రూపం కూడా దాల్చాయి. అయితే మహాత్మా గాంధీజీ యొక్క ప్రాథమిక పిలుపు అహింసా మార్గంలోనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సామూహిక సత్యాగ్రహం చేయడం. ఉద్యమం సమయంలో జరిగిన ప్రతి సంఘటనను గాంధీజీ లేదా కాంగ్రెస్ అధికారికంగా ఆమోదించిందని చెప్పడం చారిత్రకంగా సరైనది కాదు. అయినప్పటికీ, అగ్ర నాయకత్వం జైలులో ఉన్న పరిస్థితుల్లో ప్రజా అసంతృప్తి అనేక ప్రాంతాల్లో స్వతంత్ర రూపాల్లో వ్యక్తమైంది.

**బ్రిటిష్ పాలకుల అణచివేత**

క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటిష్ సామ్రాజ్య పాలనకు అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా మారింది. ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలకు పాల్పడింది. అరెస్టులు, నిర్బంధాలు, లాఠీచార్జీలు, కాల్పులు, పత్రికలపై సెన్సార్, సమావేశాల నిషేధం వంటి చర్యలతో ఉద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నించింది.కానీ బ్రిటిష్ ప్రభుత్వ నిర్బంధం ఎంత పెరిగితే, భారత ప్రజల్లో స్వాతంత్ర్య సంకల్పం అంత బలపడింది.మహాత్మా గాంధీజీ 1943లో 21 రోజుల నిరాహార దీక్ష చేపట్టారు. ఆ సమయంలోనూ ఆయన అహింస, సత్యం, స్వాతంత్ర్యం పట్ల తన నిబద్ధతను ప్రపంచానికి చాటిచెప్పారు. గాంధీజీ 1944 మే 6న విడుదలయ్యారు. (Gandhi Heritage Portal )

**స్వాతంత్ర్యానికి మార్గం సుగమం చేసిన తుది ప్రజా ఉద్యమం**

క్విట్ ఇండియా ఉద్యమం వెంటనే స్వాతంత్ర్యాన్ని సాధించకపోయినా, భారతదేశాన్ని ఇకపై బలవంతంగా బ్రిటిష్ పాలనలో కొనసాగించడం సాధ్యం కాదనే వాస్తవాన్ని ప్రపంచానికి స్పష్టం చేసింది.1942 ఉద్యమం తర్వాత భారత స్వాతంత్ర్య ఆకాంక్ష మరింత అజేయంగా మారింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత బ్రిటిష్ పాలకులు భారత దేశంలో తమ పాలనను కొనసాగించడం ఎంత కష్టమో స్పష్టంగా గ్రహించారు. చివరకు 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం సాధించింది.

అందుకే క్విట్ ఇండియా ఉద్యమాన్ని భారత స్వాతంత్ర్య సంగ్రామంలోని తుది మహా ప్రజా పోరాటాలలో ఒకటిగా చరిత్ర గుర్తించింది. భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రలో ఇది అత్యంత కీలకమైన అధ్యాయంగా నిలిచింది. (Indian National Congress)

**త్యాగధనులకు ఘన నివాళి**

క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న మహాత్మా గాంధీజీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఆచార్య కృపలానీ, అరుణా అసఫ్ అలీ, జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, ఉషా మెహతా తదితర నాయకులతో పాటు దేశవ్యాప్తంగా వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు, మహిళలు, రైతులు, కార్మికులు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాలి.

**వారి త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా భారతదేశంలో జీవిస్తున్నాం**

**నేటి తరానికి క్విట్ ఇండియా ఉద్యమం ఇచ్చే సందేశం**

క్విట్ ఇండియా ఉద్యమం మనకు కేవలం గత చరిత్రను గుర్తు చేసే ఘట్టం కాదు. అది ఐక్యత, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, త్యాగం, దేశభక్తి, అహింస, ప్రజా శక్తి వంటి విలువలను మనకు గుర్తుచేసే స్ఫూర్తిదాయక అధ్యాయం.మహాత్మా గాంధీజీ ఇచ్చిన "చేయండి లేదా చావండి" పిలుపు వెనుక ఉన్న అసలు స్ఫూర్తి – దేశ స్వేచ్ఛ కోసం సంపూర్ణంగా అంకితమవ్వడం. కాంగ్రెస్ నాయకత్వంలో కోట్లాది మంది భారతీయులు తమ భేదాలను పక్కన పెట్టి ఒకే లక్ష్యం కోసం ఏకమయ్యారు.ఈరోజు మనం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారు సాధించిన స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తుంచుకోవాలి.

క్విట్ ఇండియా ఉద్యమం భారత జాతీయ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాగిన స్వాతంత్ర్య పోరాటానికి మహత్తర ప్రతీక.మహాత్మా గాంధీజీ నాయకత్వం – భారత ప్రజల ఐక్యత – కాంగ్రెస్ కార్యకర్తల త్యాగం – స్వాతంత్ర్య సమరయోధుల ధైర్యం కలిసి బ్రిటిష్ సామ్రాజ్య పాలనకు తుది సవాలు విసిరాయి.ఆ మహనీయులందరికీ మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తూ, వారి త్యాగాల స్ఫూర్తితో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేయడమే వారికి మనం అందించే నిజమైన నివాళి.

జై హింద్! జై కాంగ్రెస్!



పి.ప్రసన్నకుమార్ శర్మ
ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

# లాల్ దర్వాజా నుంచి లండన్ దాకా తెలంగాణ బోనాల వేడుకలు

- **లాల్ దర్వాజా ఆలయంలో సింహవాహిని సంకలనాన్ని ఆవిష్కరించిన పీసీసీ ప్రధానకార్యదర్శి కొప్పులప్రవీణ్ కుమార్**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 8:**

హైదరాబాద్ నగరంలో ఆషాఢ మాసంలో జరిగే బోనాల పండుగ దేశ సరిహద్దులు దాటి ప్రపంచ దేశాలకు విస్తరించిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్‌కుమార్ అన్నారు. లాల్‌దర్వాజా నుంచి ప్రారంభమైన బోనాల వేడుకలు లండన్ వరకు విస్తరించాయని ఆయన పేర్కొన్నారు.ఆషాఢ బోనాల ఉత్సవాల విశిష్టతను విశ్లేషిస్తూ పాతనగర వాస్తవ్యులు, ప్రముఖ జర్నలిస్ట్, సుప్రసిద్ధ కవి వరకాల యాదగిరి రచించిన 'సింహవాహిని శతకం' పద్య సంకలనాన్ని శనివారం లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయంలో సంప్రదాయ పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి కొప్పుల ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధితో పాటు ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలకు ప్రాధాన్యత పెంచుతోందన్నారు.

గడచిన వారంలో దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ బోనాల వేడుకలు వైభవంగా జరిగాయని, ఈ కార్యక్రమాల్లో పలువురు జాతీయ స్థాయి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారని గుర్తు చేశారు . లాల్ దర్వాజా బోనాలు యావత్ దేశానికే కాకుండా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని ప్రశంసించారు. భక్తి ఆధ్యాత్మిక సంప్రదాయ తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రత్యేకగా నిలిచాయి అన్నారు. ప్రధానంగా.హైదరాబాద్ నగర సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే మూసీ నది గత వైభవం, లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారి మహత్యాన్ని తన స్వీయ అనుభవాలతో విశ్లేషిస్తూ జర్నలిస్ట్ వరకాల యాదగిరి 'సింహవాహిని శతకం' రచించారని ప్రవీణ్‌కుమార్ ప్రశంసించారు.



1908లో మూసీ నది వరద బీభత్సం సృష్టించిన సందర్భంలో అప్పటి నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ లాల్‌దర్వాజా ఆలయంలో పూజలు నిర్వహించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆలయ ప్రాధాన్యతతో పాటు మూసీ నది ప్రవాహం, హైదరాబాద్ చారిత్రక వైభవాన్ని శతక రూపంలో తెలుగు సాహిత్యాభిమానులను అలరించే విధంగా యాదగిరి పద్యాలు రచించారని అభినందించారు. ఆదివారం జరిగే బోనాల సమర్పణ వేడుకల్లో పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు పలువురు మంత్రులు పాల్గొంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో లాల్‌దర్వాజా సింహవాహిని ఆలయ కమిటీ ప్రతినిధులు మాణిక్ ప్రభు గౌడ్, సి. వెంకటేష్, రాజు యాదవ్, పోసాని విజయ్‌కుమార్, రంగ రాజలింగం గౌడ్, కాంగ్రెస్ నాయకులు కే. వెంకటేష్, అరవింద్‌కుమార్ గౌడ్, తిరుపతి నర్సింగరావు, రంగ శ్రీకాంత్ గౌడ్, మహంకాళి భక్తజన సంఘం ప్రధాన కార్యదర్శి గుమ్మడవెల్లి మురళీకృష్ణ, దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి, సురేఖ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రచయిత, కవి వరకాల యాదగిరిని ఘనంగా సన్మానించారు.



**లాల్ దర్వాజా మహంకాళి ఆలయంలో సింహవాహిని శతకం పద్య సంకలనం ను విడుదల చేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్. చిత్రంలో కవి వరకాల యాదగిరి, ఆలయ కమిటీ ప్రతినిధులు మాణిక్ ప్రభు గౌడ్, రాజు యాదవ్, సి. వెంకటేష్ పి విజయకుమార్, మాజీ చైర్మన్ తిరుపతి నర్సింగరావు తదితరులు.**

# చెక్ బౌన్స్ కేసులో పైలట్ రోహిత్‌రెడ్డికి ఎదురుదెబ్బ

- రూ.34.23 లక్షల కేసులో దోషిగా తీర్పు
- హైదరాబాద్ మున్సిపల్ కోర్టులో విచారణ
- మూడు సార్లు బౌన్స్ అయిన చెక్
- కంపెనీ ఫిర్యాదుతో కోర్టును ఆశ్రయించింది
- సెక్షన్ 138 కింద నేరం నిర్ధారణ
- కోర్టుకు రాకపోవడంతో ఎన్‌బీడబ్ల్యూ జారీ

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**



బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి చెక్ బౌన్స్ కేసులో కోర్టు తీర్పు ప్రతికూలంగా వచ్చింది. రూ.34.23 లక్షల చెక్ బౌన్స్ వ్యవహారంలో ఆయనను దోషిగా నిర్ధారిస్తూ హైదరాబాద్ మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఖుష్బూ ఉపాధ్యాయ తీర్పు వెలువరించారు. తీర్పు సమయంలో రోహిత్‌రెడ్డి కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ అయింది.ఈ కేసు 'మెసర్స్ ఇంటెల్లిడెక్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థతో రోహిత్‌రెడ్డికి ఉన్న ఆర్థిక వ్యవహారాలకు సంబంధించినది. సంస్థ వనరులను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకుని కంపెనీకి నష్టం కలిగించారనే ఆరోపణలు రావడంతో 2014లో ఆయన సంస్థ నుంచి రాజీనామా చేశారు.రాజీనామా అనంతరం కంపెనీతో కుదిరిన ఒప్పందం ప్రకారం రూ.34,23,000 చెల్లించాల్సి వచ్చింది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు చెందిన చెక్‌ను రోహిత్‌రెడ్డి ఇచ్చారు. అయితే ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో ఆ చెక్ నగదుగా మారలేదు. కంపెనీ ఆ చెక్‌ను మూడు పర్యాయాలు బ్యాంకులో జమ చేసినప్పటికీ ప్రతిసారీ బౌన్స్ అయింది.దీంతో సంస్థ న్యాయపరమైన చర్యలకు దిగింది. బకాయి మొత్తాన్ని చెల్లించాలని రోహిత్‌రెడ్డికి లీగల్ నోటీసు పంపినప్పటికీ స్పందన లేకపోవడంతో కంపెనీ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్‌లోని సెక్షన్ 138 కింద ఆయనను దోషిగా నిర్ధారించింది.అయితే తీర్పు వెలువడే సమయంలో రోహిత్‌రెడ్డి కోర్టులో లేకపోవడంతో న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచిన తర్వాత కేసులో విధించే శిక్ష వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# 'రెంట్ ఎ బాయ్ ఫ్రెండ్ ' తో జాగ్రత్త

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకండి
- హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరిక
- యువతులే లక్ష్యంగా సైబర్ మోసాలు
- సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలు
- ఫేక్ ప్రొఫైల్స్‌తో సైబర్ కేటుగాళ్ల వల
- బుకింగ్ పేరుతో ముందస్తు చెల్లింపులు
- క్యూఆర్ కోడ్లతో డబ్బులు దోచేస్తున్నారు
- తర్వాత బ్లాక్‌మెయిల్‌కు పాల్పడే అవకాశం
- అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచన

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**

'రెంట్ బాయ్‌ఫ్రెండ్' పేరుతో సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మి మోసపోవద్దని హైదరాబాద్ సీపీ సజ్జనార్ యువతులను హెచ్చరించారు. డేటింగ్ సేవల పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు తెరలేపారని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికలపై కనిపించే ప్రకటనల వెనుక అసలు ఉద్దేశం డబ్బులు దోచుకోవడమేనని పేర్కొన్నారు.ఆన్‌లైన్‌లో 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' పేరుతో విభిన్న ప్యాకేజీలను ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు. కాఫీ డేట్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లకు తోడుగా వస్తామంటూ వివిధ ధరలను చూపిస్తూ యువతులను ఆకర్షిస్తున్నారని చెప్పారు. 'ఆగస్టు 1 స్పెషల్' అంటూ 50 శాతం వరకు డిస్కౌంట్ ఆఫర్లను కూడా ప్రచారం చేస్తున్నారని వివరించారు.పదిగంటల పూర్తి రోజు సర్వీసు అంటూ రూ.4,499 వంటి ప్యాకేజీలను కూడా సైబర్ నేరగాళ్లు ఆఫర్ చేస్తున్నారని సీపీ వెల్లడించారు. ఇందుకోసం ఆకర్షణీయమైన యువకుల ఫొటోలతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టిస్తున్నారని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ఏఐ సాయంతో రూపొందించిన చిత్రాలను లేదా ఇంటర్నెట్ నుంచి సేకరించిన ఫొటోలను ఉపయోగిస్తున్నారని తెలిపారు.ఈ ప్రకటనలకు స్పందించిన యువతులతో నిందితులు ముందుగా చాటింగ్ మొదలుపెడతారని సజ్జనార్ వివరించారు. నమ్మకం కలిగించేలా తియ్యటి మాటలు మాట్లాడి.. ఆ తర్వాత బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ చెల్లింపు వంటి పేర్లతో డబ్బులు అడుగుతారని చెప్పారు. డిజిటల్ వాలెట్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు బదిలీ చేయించుకుని వేలాది రూపాయలు కాజేస్తున్నారని హెచ్చరించారు. డబ్బులు అందిన తర్వాత నకిలీ ఖాతాలను, ఫోన్ నంబర్లను బ్లాక్ చేసి సైబర్ నేరగాళ్లు మాయమవుతున్నారని సీపీ తెలిపారు. అంతటితో మోసం ముగిసిపోదని.. చాటింగ్ సమయంలో సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత వివరాలు, ఫొటోలను ఉపయోగించి బాధితులను బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు.అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో పరిచయం పెంచుకుని నేరుగా కలవడం కూడా ప్రమాదకరమని సజ్జనార్ సూచించారు. ఇలాంటి పరిచయాల ద్వారా మరింత పెద్ద మోసాల్లోకి లాగే అవకాశం ఉందన్నారు. ఆకర్షణీయమైన డేటింగ్ లేదా స్నేహం పేరుతో వచ్చే ఆఫర్లను చూసి తొందరపడి స్పందించవద్దని సూచించారు.ఎలాంటి అనుమానాస్పద ఆఫర్ వచ్చినా ముందస్తుగా డబ్బులు చెల్లించకూడదని సీపీ స్పష్టం చేశారు. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, బ్యాంకు సమాచారం లేదా ఇతర సున్నితమైన సమాచారాన్ని పంపొద్దని సూచించారు. సోషల్ మీడియాలో యువతులు మరింత అప్రమత్తంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల ఆన్‌లైన్ పరిచయాలు, సోషల్ మీడియా కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలని సజ్జనార్ సూచించారు.ఇలాంటి మోసాలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించారని సీపీ తెలిపారు. 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' పేరుతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# ఆన్‌లైన్ యుగంలో మహిళలు శక్తివంతంగా ఎదగాలి

- యూత్ కాంగ్రెస్ 'నారీ శక్తి అభియాన్' శిక్షణ కార్యక్రమంలో మంత్రి సీతక్క
- మహిళల సాధికారతకు కాంగ్రెస్ కృషి
- మహిళల ఎదుగుదలకు పార్టీ అండగా ఉంటుందన్న సీతక్క

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**




ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వారు అన్ని రంగాల్లో శక్తివంతంగా ఎదగాలని తెలంగాణ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. మహిళలు తమ సామర్థ్యాలను గుర్తించి ఆర్థికంగా, సామాజికంగా స్వావలంబన సాధించాలని సూచించారు.ఢిల్లీలో శనివారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ 'నారీ శక్తి అభియాన్' శిక్షణ కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. మారుతున్న సాంకేతిక పరిస్థితులతో పాటు మహిళల ముందుకొస్తున్న కొత్త సవాళ్లను గుర్తించి వాటిని అధిగమించేలా యువతులు తమను తాము తీర్చిదిద్దుకోవాలని అన్నారు.రాజకీయాల్లో మహిళలకు మరింత ప్రాతినిధ్యం, నాయకత్వ అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషిస్తోందని సీతక్క పేర్కొన్నారు. మహిళలు రాజకీయ రంగంలో చురుకైన పాత్ర పోషించినప్పుడే సమాజంలో సమానత్వం మరింత బలపడుతుందని అన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంతో పాటు ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.మహిళా సాధికారతను కేవలం రాజకీయ ప్రాతినిధ్యానికే పరిమితం చేయకుండా ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. ప్రతి మహిళ తన కాళ్లపై తాను నిలబడేలా అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.మహిళలు తమ హక్కులు, అవకాశాలపై అవగాహన పెంచుకుని.. సాంకేతికతను సానుకూలంగా వినియోగించుకోవాలని సీతక్క సూచించారు. ఆన్‌లైన్ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంతో పాటు అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

# ఎక్సలెన్సీ డెవలపర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సంతోష్ విక్రమ్ గుప్తా జన్మదిన వేడుకలు

**ఎల్ బి నగర్ వెలుతురు ఆగస్టు 08:**

ఎక్సలెన్సీ డెవలపర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ విక్రమ్ గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకుని సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎక్సలెన్సీ ప్రాపర్టీస్ వెంచర్లలో ప్లాట్లు కలిగి ఉన్న కస్టమర్లకు సంస్థ ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎలక్ట్రిక్ బైకులను పంపిణీ చేశారు. కస్టమర్లకు ఇచ్చిన మాటను ఎలాంటి రాజీ లేకుండా నెరవేర్చామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ, "మాట ఇచ్చామంటే తప్పకుండా నిలబెట్టుకుంటాం. చెప్పిందే చేస్తాం.. చేసేదే చెబుతాం" అని స్పష్టం చేశారు. కస్టమర్ల నమ్మకమే సంస్థకు ప్రధాన బలమని, భవిష్యత్తులో కూడా వినియోగదారులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు సంస్థ కట్టుబడి ఉంటుందని తెలిపారు.ఎక్సలెన్సీ డెవలపర్స్ సంస్థ గత ఐదు సంవత్సరాలుగా విజయవంతంగా కార్యకలాపాలు కొనసాగిస్తూ, ప్రస్తుతం ఐదు వెంచర్లను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. నాణ్యత, పారదర్శకత, కస్టమర్ల విశ్వాసానికి ప్రాధాన్యత ఇస్తూ సంస్థ ముందుకు సాగుతోందన్నారు.కస్టమర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉండటమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా తమ వెంచర్లలో ప్లాట్లు కలిగి ఉన్న కస్టమర్ల కోసం సంవత్సరంలో 12 సార్లు ఉచితంగా సైట్ విజిట్‌కు తీసుకెళ్లేందుకు ఫ్రీ ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు."చెప్పింది చేస్తాం.. చేసేదే చెబుతాం" అనే సంస్థ నినాదానికి అనుగుణంగా ఉచిత బైకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేశారు.




# పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు ఆగస్టు 08:**

కరీంనగర్ నగరంలోని 6వ డివిజన్ బొమ్మకల్ గ్రామంలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలలో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు సమర్పించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో నగర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మేయర్ ప్రార్థించారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని, ఇటువంటి పండుగలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు శ్రీ మేకల వెంకటేష్ గారు, గాదె రూప శ్రీనివాస్ గారు, కో-ఆప్షన్ సభ్యులు శ్రీ ఎలగందుల నందకుమార్ గారు, నాయకులు పురమళ్ళ శ్రీనివాస్ గారు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బోనాల పండుగకు జిల్లా గణేష్‌కు ఆలయ కమిటీల ఆహ్వానం

- ఆల్విన్ కాలనీలోని పలు అమ్మవారి ఆలయాల్లో పూజలకు ఆహ్వానం

**కూకట్ పల్లి ఆగస్టు 8 వెలుతురు:**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్‌లో పలు అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. బోనాల పండుగ సందర్భంగా నిర్వహించే అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు జిల్లా ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక జీవనంలో బోనాల పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. అమ్మవారి పూజా కార్యక్రమాలకు తనను ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని, ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్ కాలనీతో పాటు పలు కాలనీలకు చెందిన అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలి : టియుటిఎఫ్ డిమాండ్

- ఆరు డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
- ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి
- శంకర్ పల్లిలో ఘనంగా టీయూటీఎఫ్ 15వ ఆవిర్భావ దినోత్సవం

**శంకర్ పల్లి, వెలుతురు ఆగస్టు 08 :**



తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండవ పీఆర్సీ ని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం శంకర్ పల్లిలో టీయూటీఎఫ్ సంఘం 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఒక చారిత్రక అవసరంగా టీయూటీఎఫ్ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల హక్కులు, వారి సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఈ సంఘం నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

**నెలకూ రూ. 15-20 వేల నష్టం..**

ఉద్యోగ, ఉపాధ్యాయులు గత మూడేళ్లుగా పీఆర్సీ కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని రఘునందన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం 6 డీఏలు పెండింగ్‌లో పడిపోయాయని, దీనివల్ల ఒక్కో ఉద్యోగి ప్రతీ నెలా రూ. 15 వేల నుండి రూ. 20 వేల వరకు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులను ఇంతలా ఇబ్బంది పెట్టడం ఏ ప్రభుత్వానికైనా శ్రేయస్కరం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, వెంటనే పీఆర్సీ రిపోర్టును బహిర్గతం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దాంతో పాటు పెండింగ్ డీఏలు, ఇతర మెడికల్, సరెండర్ బిల్లులన్నింటినీ వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్ పాషా, జిల్లా ఉపాధ్యక్షులు కె. నారాయణ, జిల్లా కార్యదర్శి ఎ.సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. మొగులయ్య, టీయూ టీఎఫ్ శంకర్ పల్లి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.అంజయ్య, వి.శ్రీనివాస్ చారి, కొందుర్గు ప్రధాన కార్యదర్శి బి. దేవేందర్ రెడ్డి, చేవెళ్ల ప్రధాన కార్యదర్శి ఎం.శివానందం, ఉపాధ్యక్షులు బి.మోహన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్ రావు, జగదీశ్వర్, బాబు నాయక్ పాల్గొన్నారు.



# రూ1.83 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- కుత్బుల్లాపూర్‌లో అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట: కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ వెలుతురు ఆగస్టు 08:**



దుండిగల్ సర్కిల్ పరిధిలోని గండి మైసమ్మలో ఉన్న రాజరాజేశ్వర కాలనీ లో రూ.90 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, రూ.63 లక్షలతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.అదేవిధంగా శ్రీనివాస్ నగర్ కాలనీలో రూ.30 లక్షలతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, మొత్తంగా రూ.1.83 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు కోరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు.ఈ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్ తదితర పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి గారు, మాజీ కౌన్సిలర్ రాము గౌడ్, డిసిసి వైస్ ప్రెసిడెంట్ ముత్యం రెడ్డి, యాదవ రెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సదానందం, తిరుపతి రెడ్డి మరియు స్థానిక కాలనీల అధ్యక్షులు రాజిరెడ్డి, మోహన్ రెడ్డిలతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుండెపోటుతో కుటుంబ పెద్ద మృతి

- **ముగ్గురు ఆడపిల్లల కుటుంబానికి మన ఆపద్బాంధవులు చేయూత**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 08:**




గ్రామం జనం పల్లి నీలం శేఖర్ మన ఆపద్బాంధవుల ఫౌండేషన్ ముఖ్య సభ్యులు 50 కేజీల బియ్యం 14 రకాల నిత్యవసర సరుకుల పంపిణీ. మన దగ్గర ఉన్నదాన్ని పంచుకోవడం దానం మనసుతో పంచుకునే చేయూతే మానవత్వం.రామన్నపేటమండలంలోని జనంపల్లి గ్రామానికి చెందిన గంగిరెద్దుల కుటుంబానికి చెందిన అవుల రమేష్ గత నెల 20వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. దీంతో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఎదుర్కొంటున్న పరిస్థితి గమనించి తన భార్య వెంకటమ్మ, ముగ్గురు ఆడపిల్లలతో కలిసి జనంపల్లి గ్రామంలోనే నివాసం ఉంటూ గంగిరెద్దులతో ఊరూరా తిరుగుతూ జీవనం సాగించేవారు. కుటుంబానికి ఇతర ఏలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో ప్రస్తుతం రేకుల ఇంట్లోనే నివాసం ఉంటున్నారు. ఈ కుటుంబ పరిస్థితిని గమనించిన జనంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పోషబోయిన మల్లేశం మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ ముఖ్య సభ్యులు నీలం శేఖర్ దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందిస్తూ ఈ రోజు ఆ కుటుంబానికి 50 కేజీల బియ్యం 14 రకాల నిత్యవసర సరుకులు వారి నివాసంలో అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఫౌండేషన్ ముఖ్య సభ్యులు నీలం శేఖర్ పాల్గొని వారు మాట్లాడుతూ,మనసహాయం ఎంత చిన్నదైనా కావచ్చు, కానీ ఆ సహాయం కోసం ఎదురుచూస్తున్న మనిషికి అది ఒక కొత్త జీవితమే.మన చేతి నుంచి వెళ్లే చేయూత ఒక కుటుంబం కళ్లలో కన్నీటిని తుడిచి,

వారి జీవితంలో ఆశను నింపగలదు."కుటుంబ పెద్దను కోల్పోయి ముగ్గురు ఆడపిల్లల బాధ్యతను ఒంటరిగా మోస్తున్న వెంకటమ్మ కుటుంబ పరిస్థితి ఎంతో బాధాకరం. ఇలాంటి ఆపద సమయంలో మానవతావాదులందరూ తమవంతు సహాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలవాలి. ఈ ముగ్గురు ఆడపిల్లల చదువులు మధ్యలో ఆగిపోకుండా వారి విద్యకు అవసరమైన సహకారం అందించేందుకు మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ కృషి చేస్తుంది" అని తెలిపారు. మన ఆపద్బాంధవులు ఫౌండేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలో ఇప్పటివరకు దాదాపు 2,000/- (రెండూవేల)కుటుంబాలకు రూ.40,00000/- నలభై లక్షల మేర సహాయం అందిస్తూ ముందుకు సాగుతోందని.. అలాగే ఫౌండేషన్‌లోని సుమారు 1,000/- వేయ్యి మంది సభ్యుల సహకారంతో వివిధ కారణాలతో కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని, ఇప్పటివరకు 17 కుటుంబాలకు జీవనోపాధి కల్పించేలా సహకారం అందించామని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాల్లోని విద్యార్థుల చదువులకు భరోసా కల్పించడం, నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు మానవతా దృక్పథంతో అండగా నిలవడం తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు."ఈ ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఫౌండేషన్ సభ్యులు, దాతలు, మానవతావాదుల సహకారంతో నిరంతరం కృషి చేస్తాం. ఆపదలో ఉన్న కుటుంబానికి మనమంతా కలిసి అండగా నిలిస్తే వారి జీవితాల్లో కొత్త ఆశలు నింపగలం"అని నీలం శేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వేముల సైదులు, బాదే చంద్రశేఖర్, ఈదులకంటి శివకుమార్ , సురేష్ , రాజు, మృతుని భార్య వెంకటమ్మ, నరేష్ , మధు , తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- **మున్సిపాలిటీ పద్మశాలి సంఘం అధ్యక్షులు కూరపాటి రాములు**

**మోత్కూర్, ఆగష్టు 08,వెలుతురు :**



మోత్కూర్ మున్సిపాలిటీ పద్మశాలి సంఘం అధ్యక్షులు కూరపాటి రాములు గారి అధ్యక్షతన సంఘ కార్యవర్గ సమావేశము జరిపారు.ఈ సమావేశంలో అధ్యక్షులు కూరపాటి రాములు మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యతతో ఉండి సంఘాలను బలోపేతం చేసుకోవాలని కోరారు.ప్రభుత్వము చేనేత కార్మికులకు ప్రకటించిన పథకాలను అన్ని అమలుపరిచి చేనేత కార్మికులను ఆదుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వము ప్రకటించిన నేతన్న భరోసా,నేతన్న పొదుపు బకాయిలను విడుదల చేయాలని అన్నారు.నేత కార్మికులకు సంబంధించినటువంటి రంగు రసాయనాలను ధరలను తగ్గించాలని అన్నారు. సహకార సంఘాలకు బ్యాంకులలో ఉన్న అప్పులను ప్రభుత్వము మాఫీ చేసి చేనేత సహకార సంఘాలను కాపాడాలని మరియు సంఘాల ద్వారా చేరేత కార్మికులకు పని కల్పించి వారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు ఎలగందుల సత్యనారాయణ,కార్యదర్శి పసునూరి యాదయ్య,కోశాధికారి నోముల రమేష్,జోగు రామచంద్రం,పసునూరి రమేష్, జెల్ది రాములు,పెండం శ్రీనివాసు, జల్ది సత్యనారాయణ,వంగరి బాలరాజు,బిరుదు శ్రీను,గుర్రం రవి తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**మోత్కూర్, ఆగష్టు 08,వెలుతురు :**



మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని 8వ వార్డు అంగడి బజార్ కు చెందిన ఆరె జహంగీర్ ఇటీవల మృతి చెందగా శనివారం ఆ కుటుంబాన్ని అతని స్నేహితులు పరామర్శించారు. కుటుంబానికి మనోధైర్యం కల్పించి స్నేహితులంతా కలిసి సేకరించిన రూ.67 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిని యాకు, ఎడ్ల తిరుమలేష్, పురుగుల శ్రీను, అవిశెట్టి యాదగిరి, బుర్ర ఉపేందర్, అవిశెట్టి కిరణ్ కుమార్, పురుగుల మల్లేష్, ఎడ్ల శేఖర్, అవిశెట్టి మధు, ఎలిమినేటి సాయికుమార్, అవిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# కొమ్మాయిగూడెంలో తల్లిపాల వారోత్సవం, అన్నప్రాసన

- **కార్యక్రమం ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 08:**

గ్రామం కొమ్మాయిగూడెం అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవం మరియు అన్నప్రాసన కార్యక్రమం లో సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి చిన్నపిల్లల తల్లి తండ్రులతో కలిసి పాల్గొని అన్నప్రాసన చేసి, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ అంగన్వాడీ టీచర్లు బోయపల్లి సత్యవతి, మోటే ప్రతిభ భారతి, ఉపసర్పంచ్ తీర్వాల ఐలయ్య వార్డు సభ్యులు అంబాల అశోక్, వీరమళ్ళ లింగస్వామి, బుర్ర శ్రీశైలం , ప్రాథమిక పాఠశాల అధ్యాపక బృందం, గ్రామ ఆశా వర్కర్లు, గోపగోని సహదేవ , బాలగోని శంకర్ , చిన్నపిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 10 న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యండి

- **రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి**

**మోత్కూర్, ఆగష్టు 08, వెలుతురు :**

ఆగస్టు 10 న నిర్వహించ తలపెట్టిన జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని రైతు సంఘం జిల్లా నాయకులు పైళ్ల యాదిరెడ్డి పిలుపు నిచ్చారు. ఆయన మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, కార్మిక, రైతు వ్యవసాయ కార్మికుల హక్కులపై తీవ్రదాడిచేస్తుందని విమర్శించారు. కార్పొరేట్ లాభల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరచి కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, లేబర్ కోడ్లు తీసుకోచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తూ గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బతీస్తున్న బీజేపీ విధానాలను దేశ ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు ప్రభుత్వం కొనుగోలు గ్యారెంటి కల్పించాలని, వ్యవసాయ బోర్లకు మీటర్లు పెట్టడం అంటే వ్యవసాయ రంగాన్ని నీరుకార్చడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ రుణాలు, ఎరువులు విత్తనాలు వంటి సమస్యలపై రైతులు ఆందోళనలో ఉన్నారని, భారత వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కేంద్ర




ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జరిగే జైల్ భరో కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా కార్మికులు, రైతులు ప్రజలు అధిక సంఖ్యలో కదలి రావాలని పిలుపునిచ్చారు.రామన్నపేట వెలుతురు న్యూస్ ఆగస్టు 08: గ్రామం కొమ్మాయిగూడెం అంగన్వాడీ టీచర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవం , అన్నప్రాసన కార్యక్రమంలో సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి చిన్నపిల్లల తల్లి తండ్రులతో కలిసి పాల్గొని అన్నప్రాసన చేసి, పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ అంగన్వాడీ టీచర్లు బోయపల్లి సత్యవతి, మోటే ప్రతిభ భారతి, ఉపసర్పంచ్ తీర్వాల ఐలయ్య వార్డు సభ్యులు అంబాల అశోక్, వీరమళ్ళ లింగస్వామి, బుర్ర శ్రీశైలం , ప్రాథమిక పాఠశాల అధ్యాపక బృందం, గ్రామ ఆశా వర్కర్లు, గోపగోని సహదేవ , బాలగోని శంకర్ , చిన్నపిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో గొంగిడి శ్రీరాములు మృతి

- **నివాళులర్పించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 08:**



గ్రామం ఇంద్రపాలనగరం గుండెపోటుతో మరణించిన గొంగిడి శ్రీరాములు మృతుదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేసిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ఉ పసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, వార్డ్ సభ్యులు వరికుప్పల స్వామి,వడ్లకొండ లక్ష్మి మల్లేశం,మాజీ ఏఎంసి డైరెక్టర్ మందడి విద్యాసాగర్ రెడ్డి, యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్, మంటి లింగస్వామి, రాజన్నగారి రమేష్, చేనేత సహకారసంఘము అధ్యక్షులు రవ్వ నర్సింహా,మాజీ ఏఎంసి డైరెక్టర్ గర్ధాస్ కరుణాకర్, మాజీ ఉపసర్పంచ్ సింగణబోయిన జంగయ్య యాదవ్, పాలసంఘము డైరెక్టర్ గర్ధాస్ వెంకటేష్, మంటి బిక్షపతి, సింగణబోయిన ఆంజనేయులు, నక్క వెంకటేష్, నల్ల రామస్వామి, కాటేపెల్లి మహేష్, వెలిమినేటి నరేష్, బోనగిరి మధు, గర్ధాస్ సాయి, భువనగిరి మహేష్, పాల్గొన్నారు.

# ఇంద్రపాలనగరాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- **ప్రధాన కూడలిలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటుచేసిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్**

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 08:**



ఇంద్రపాలనగరం గ్రామంలో గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ అంబేద్కర్ విగ్రహం మెయిన్ రోడ్డు వద్ద గత 10 సంవత్సరాలుగా హైమస్ట్ లైట్లు లేక పోవడం వలన గ్రామప్రజలు,బాటసారులు ఇబ్బంది పడుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొని నూతనంగా హైమాస్ట్ లైట్లను బిగించి వాటిని ప్రారంభించినరు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లఖంబ్ రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరం

**చౌటుప్పల్ వెలుతురు ఆగస్టు 08:**





ప్రాచీన యుద్ధ క్రీడ మల్లకంభ చిన్నతనం నుంచే విద్యార్థులకు నేర్పిస్తే ఉపయోగం ఉంటుందని చౌటుప్పల్ పోలీస్ ఇన్స్పెక్టర్ జి మన్మధ కుమార్ తెలిపారు. చౌటుప్పల్ లోని ట్రినిటీ స్కూల్లో తెలంగాణ రాష్ట్ర మలకంబ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి కోచ్ ల లెవెల్_1 శిక్షణ శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మన్మధ కుమార్ మాట్లాడుతూ పోలీసులకే కఠినమైన శిక్షణ ఉంటుందని అనుకున్నానని, మల్ల కంబ అంతకంటే గొప్ప శిక్షణ అని కొనియాడారు. మలకంభ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ఉజ్జీని మంజుల మాట్లాడుతూ, తెలంగాణ నుంచి మల్ల కంభ క్రీడాకారులను ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనేలా శిక్షణ నివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అక్టోబర్లో హైదరాబాదులో నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయ స్థాయి పోటీల్లోనూ తెలంగాణ నుంచి మల్లకంభ క్రీడాకారులు పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి 42 మంది కోచ్ లు పాల్గొన్నారు. తెలంగాణ మల్ల కంభ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, కోశాధికారి పోలే అంజయ్య, ట్రినిటీ స్కూల్ చైర్మన్ కే వి బి కృష్ణారావు, ఎంఎంఆర్ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ సాహు పాల్గొన్నారు.






# ఏ బూసి సాయిలు మృతి చాలా బాధాకరం

- **ఆర్థిక సహాయం అందించిన**
- **కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నిర్నంల**

**రామన్నపేట వెలుతురుఆగస్టు 08:**



మండలం నీర్నంల గ్రామానికి చెందిన ఏ బూసి సాయిలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి సాయిలు మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పెరుమాండ్ల నవీన్మా జీ వార్డ్ మెంబర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు నోముల ప్రవీణ్, నోముల కృష్ణ ,ముత్యాల శివకుమార్,దాసరి నరసింహ, నోముల ముఖేష్, చిప్పలపల్లి ముత్తయ్య, చిప్పలపల్లి సురేష్ , ఏ బూసి చంటి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భవాని హోటల్ ప్రారంభం శుభాకాంక్షలు తెలిపిన గ్రామ ప్రజలు యువకులు

**రామన్నపేట వెలుతురు ఆగస్టు 08:**

మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా మా గ్రామ వాస్తవ్యులు చిప్పలపల్లి స్వామి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ భవాని హోటల్ ప్రారంభమైంది. హోటల్ ప్రారంభం సందర్భంగా చిప్పలపల్లి స్వామిని శాలువాతో ఘనంగా సత్కరించి, ముత్యాల సాయిలు, ముత్యాల రమేష్, చిప్పలపల్లి జితేందర్‌లు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,శ్రీ భవాని హోటల్ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ మంచి ఆదరణ పొందాలని, వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.నూతనంగా ప్రారంభమైన హోటల్‌కు స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించాలని, నిర్వాహకులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానికులు పాల్గొని చిప్పలపల్లి స్వామికి శుభాకాంక్షలు తెలిపారు.



## శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో అంగరంగ వైభవంగా బోనాల వేడుకలు

**బొల్లారం వెలుతురు ఆగస్టు 08:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం సంప్రదాయ అలంకరణలతో కళకళలాడగా, విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని తెలంగాణ గొప్ప సంస్కృతిని ప్రతిబింబించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కొత్వాల్ హరికృష్ణ రెడ్డి , అకడమిక్ డైరెక్టర్లు సింహాచలం , మహిపాల్ రెడ్డి , ప్రిన్సిపల్ హరిప్రియ , వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ , గీతాంజలి రోబోటిక్ కరెస్పాండెంట్ కిషోర్ ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమానికి విశిష్టతను చేకూర్చారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించిన అనంతరం విద్యార్థులు తెలంగాణ జానపద నృత్యాలు, జానపద గీతాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణం భక్తి, సంస్కృతి, ఆనందంతో కళకళలాడింది.ఈ సందర్భంగా చైర్మన్ కొత్వాల్ హరికృష్ణ




రెడ్డి మాట్లాడుతూ "విద్యతో పాటు భారతీయ సంస్కృతి, తెలంగాణ సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో విలువలు, దేశభక్తి, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని బోనాల పండుగను ఘన విజయవంతం చేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే దిశగా శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహించిన ఈ బోనాల వేడుక అందరి ప్రశంసలను అందుకుంది.

## ఓయూలో నవతెలంగాణ ఓయూ జర్నలిస్టు డా. తలారి శ్రీనివాస రావు కు ఘన సన్మానం

- మల్టీ ఐడియాలు, మేల్కొపడంలో అన్ని వర్గాల్లో మమేకం కావడం లో దిట్ట

**హైదరాబాద్ ఆగస్టు 08 (వెలుతురు) :**

నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉత్తమ స్టోరీల పోటీల్లో హైదరాబాద్ రీజియన్ పరిధిలో ప్రథమ బహుమతి సాధించిన నవతెలంగాణ ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిస్టు డాక్టర్ తలారి శ్రీనివాస రావు కు మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఓయూ విద్యార్థి, ఉద్యోగ సంఘాల, నిరుద్యోగ జేఏసీ, పరిశోధక విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ లో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆర్.ఎల్. మూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, విద్యార్థి నాయకులు, నిరుద్యోగ జేఏసీ నాయకులు, జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని డాక్టర్ తలారి శ్రీనివాస రావు అభినందించారు. జర్నలిజంతో పాటు సోషల్ మీడియా, వాట్సాప్ బ్రేకింగ్ న్యూస్ ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు,యూనివర్సిటీ పరిపాలన మధ్య సమాచార వారధిగా నిలిచారని కొనియాడారు.ఉదయం నుంచి రాత్రి వరకు ఓయూలో చోటుచేసుకునే ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ, నవతెలంగాణ దినపత్రికతో పాటు డిజిటల్ వేదికల ద్వారా సమాజానికి చేరవేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.టీపీసీసీ జనరల్ సెక్రటరీ చేనగాని. దయాకర్ మాట్లాడుతూ. తలారి శ్రీనివాస్ అందరితో ఆత్మీయంగా మెలుగుతూ, వాస్తవాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువచ్చే జర్నలిస్టుగా గుర్తింపు పొందారని అన్నారు. ఓయూ లో తెలంగాణ ఉద్యమం నుండి , 100 ఓయూ వేడుకల్లో సహితం నవ తెలంగాణ ఓయూ పై ప్రత్యేక సంచిక తీసుకు వచ్చి ఓయూ ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా తీసుకు వెళ్లడం లో, సమస్యలను తన కథనాల ద్వారా ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఒకప్పుడు విద్యార్థి, యువజన



నేతగా, అతి చిన్న వయసులోనే గ్రామంలో ఎంపీటీసీ గా, నేడు విలువలతో కూడిన జర్నలిస్టుగా ఆయన సాగిస్తున్న ప్రయాణం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.మల్టీ ఐడియాలు ,నిత్యం కథనాలు రాయడంలో ,ఓయూ ను మేల్కొపడం లో అయిన దిట్ట అన్నారు.ఈ సందర్భంగా పలువురు అయిన గురించి తమ అనుబంధన్ని మాటల్లో చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ జనగాని దయాకర్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆర్.ఎల్. మూర్తి, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, పరంధాములు, , ఎన్జీఓల సంఘం అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, శంకరన్న పవన్,నాగరాజ రావు, వలిగొండ నరసింహ, బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం నాయకులు వేణు, మహేష్, ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షుడు కిరణ్, ఏఐఎ స్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉదయ్, జార్జి రెడ్డి పీడీఎస్ అధ్యక్షుడు నాగేశ్వర్, సుమంత్, నిరుద్యోగ జేఏసీ నాయకులు శీను, కాశి, డాక్టర్ మాన్ల రవి, సంఘం నాయకుడు వెంకట్ గౌడ్ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉస్మాని యా యూనివర్సిటీ మాజీ వీసీ లు ప్రొ. రామ చంద్రము, ప్రొ. సత్యనారాయణ, ప్రొ.గోపాల్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాలకిష్టా రెడ్డి, పలువురు సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొ.రవీందర్ , ఫోన్ ఆశీర్వదించారు. పలువురు విద్యార్థులు, ఉద్యోగులు, ప్రొపెసర్స్, సికింద్రాబాద్ అధికారులు, శుభాకాంక్షలు సోషల్ మీడియా ద్వార శుభాకాంక్షలు తెలియజేశారు.

## గీతన్నల చైతన్య బస్సుయాత్రను జయప్రదం చేయాలి

- వాల్ పోస్టర్ ఆవిష్కరించిన రమేష్ గౌడ్, దిగ్వాల్ శ్రీనివాస్ గౌడ్, విట్టల్ గౌడ్...

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 08:**

గీత కార్మికుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం చేపట్టిన గీతన్నల చైతన్య రాష్ట్ర బస్సుయాత్రను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆగస్టు 13న రాష్ట్ర బస్సుయాత్ర సంగారెడ్డి జిల్లాకు రానున్న నేపథ్యంలో శనివారం జహీరాబాద్ పట్టణంలో గీతన్నల చైతన్య యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికులకు, గౌడ సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్లు గీత వృత్తి సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని కోరారు. వనమహోత్సవంలో భాగంగా ఈత, తాటి చెట్ల పెంపకాన్ని చేపట్టేలా గీత కార్మికుల్లో చైతన్యం కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా గీతన్నల చైతన్య బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆగస్టు 2న మహబూబాబాద్‌లో ప్రారంభమైన ఈ బస్సుయాత్ర ఆగస్టు 13న సంగారెడ్డి జిల్లాకు



చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో యాత్రకు ఘన స్వాగతం పలుకుతూ భారీ బైక్ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని కల్లుగీత కార్మికులు, గౌడ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ యాత్ర ఆగస్టు 18 వరకు కొనసాగి హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ముగుస్తుందని రమేష్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో దిగ్వాల్ శ్రీనివాస్ గౌడ్, విట్టల్ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాణిక్ ప్రభు గౌడ్, రంగా గౌడ్, వెంకటపురం అంజా గౌడ్, శేఖర్ గౌడ్, లక్ష్మా గౌడ్, రవి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి రోజును జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి

- టిబిఈఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి గూగులోత్ హుస్సేన్ నాయక్

**నూతనకల్ ఆగస్టు 8 (వెలుతురు):**

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15 ను జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని రాజ్యసభ సభ్యుడు డా.కె లక్ష్మణ్ రాజ్యసభ లో శుక్రవారం ఉద్గాటించారు.ఈ సందర్భంగా తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ సూర్యాపేట జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాజ్యసభ లో జీరో అవర్ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు డా.కె లక్ష్మణ్ మాట్లాడుతూ పూజ్య గురువు సంఘ సంస్కర్త బంజారా సమాజానికి మార్గదర్శి శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15 న జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని పిలుపునిచ్చారు.సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితాన్ని పేదలు గిరిజన వర్గాలు అణగారిన అభ్యున్నతికి అంకితం చేశారు.అదేసమయంలో సత్యం సమానత్వం సాంఘిక సామరస్యం స్వావలంబన మరియు ప్రకృతి పట్ల గౌరవం వంటి శాశ్వత విలువలను వ్యాప్తి చేసారని ఎంపీ రాజ్యసభలో గుర్తుచేశారు. ఫిబ్రవరి 15 ను జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని రాజ్యసభ ఎంపీ పిలుపు ఇవ్వడం పట్ల టిబిఈఎస్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు దారాసింగ్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు హుస్సేన్ నాయక్, కోశాధికారి రఘునాయక్, కలసి యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజల తరపున హర్షం వ్యక్తం చేశారు.



## పన్నులు వసూలు.. అభివృద్ధి ఏదీ?

- సీపీఐ పాదయాత్రలో సమస్యల పరిశీలన...
- పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయం ముట్టడి...
- సీపీఐ డివిజన్ సమితి కార్యదర్శి కె.నర్సింలు...

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 08:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. సీపీఐ డివిజన్ సమితి కార్యదర్శి కె.నర్సింలు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర శనివారం మూడో రోజుకు చేరింది. వెంకటరమణ కాలనీలో పర్యటించిన నాయకులు స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.దళితవాడల్లో మురుగుకాలువలు, సీసీ రహదారులు, విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలు వంటి కనీస సౌకర్యాలు లేవని జలాలుద్దీన్ ఆరోపించారు. వర్షాలు కురిసినప్పుడు రహదారులు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు పన్నులు వసూలు చేస్తున్నా.. వార్డుల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు.మంజూరైన రహదారి పనులను ఇతర ప్రాంతాలకు తరలించడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం




చేస్తున్నారని చెప్పారు. వార్డుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే అన్ని వార్డుల ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు అఫ్జల్, అశోక్, అశ్వక్ హుస్సేన్, వినయ్, గౌస్ ఉద్దీన్, వెంకట్, రాములు, ఇస్మాయిల్, శోభన, మంగమ్మ, తుల్జమ్మ, అనుమమ్మ, తేజమ్మ, సుశీలమ్మ, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా షెట్కర్, తన్వీర్ జన్మదిన వేడుకలు

- కోహిర్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు...
- రోగులకు పండ్ల మున్సిపల్ కార్మికులకు వస్త్రాలు పంపిణీ...

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 08:**

జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కర్, మాజీ ఐడీసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం కోహిర్‌లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీర్ ముజఫర్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్ మ్యాతరి అశోక్, వైస్ చైర్మన్ ఎం.ఎ. హన్నన్ జావీద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి వస్త్రాలు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముజఫర్ హుస్సేన్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ఎంపీ సురేష్ షెట్కర్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన కృషి చేస్తున్నారని తెలిపారు. మాజీ ఐడీసీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ కులమతాలకు అతీతంగా ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఇరువురు నాయకులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ షాకీర్ అలీ, నంచారి, శిరీషరాణి, జగదీష్, అజ్జు పటేల్, యూసుఫ్ పటేల్,



మహమ్మద్ మతీన్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది నాయకులతో కలిసి ఎంపీ సురేష్ షెట్కర్, మాజీ చైర్మన్ తన్వీర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.




## జహీరాబాద్ లో ఘనంగా పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

- చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన మహావీరుడు పండుగ సాయన్న...
- భీమ్ ఆర్మీ రాష్ట్ర చీఫ్ సిద్దు రావణ్...

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 08:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పండుగ సాయన్న ముదిరాజ్ 135వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకుని జహీరాబాద్ బస్టాండ్ నుంచి ప్రధాన కూడలి మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ మాట్లాడుతూ.. రాజ్యం భ్రష్టుపట్టినప్పుడు, అవినీతి, దోపిడీ, అన్యాయం పెరిగినప్పుడు ప్రజల్లో నుంచి వీరులు ఉద్భవిస్తారని అన్నారు. అణగారిన వర్గాల కోసం గొంతెత్తి, అన్యాయాన్ని ఎదిరించిన మహావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని కొనియాడారు.నిజాం పాలనలో రజాకార్లు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పండుగ సాయన్న తిరుగుబాటు చేశారని సిద్దు రావణ్ పేర్కొన్నారు. పేదల పక్షాన నిలబడి పెత్తందారులను ఎదిరించినందుకు ఆయనను బందిపోటుగా చిత్రీకరించారని, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడినందుకు ఆయనను హతమార్చారని తెలిపారు. వీరులకు మరణం ఉండదని, వారి పోరాట స్ఫూర్తి తరతరాలకు కొనసాగుతుందని అన్నారు.పండుగ సాయన్న జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిద్దు రావణ్ డిమాండ్ చేశారు. చరిత్ర మరచిన



మహావీరుడి పోరాట గాథను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు, ఉద్యమకారులు, భీమ్ ఆర్మీ నియోజకవర్గ, మండల నాయకులు శంకర్, నరసింహ, గోపాల్, బాలరాజు, విజయ్, రాములు, మహమ్మద్ అలీం, సలీం, నర్సింలు ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్, ప్రేమ్ కుమార్, సదానంద్, రామచందర్, ధనరాజ్, బక్కన్న, బౌద్ధిస్ట్ రాహుల్, బీసీ సంఘ నాయకులు నర్సింలు ముదిరాజ్, సిద్ధార్థ్, అడ్వకేట్ రాకేష్, శ్రీకాంత్ ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎంపీ సురేష్ షేట్కార్ జన్మదిన వేడుకలు

- పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణి

**జహీరాబాద్ వెలుతురు ఆగస్టు 08:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీ సురేష్ కుమార్ షేట్కార్ జన్మదిన వేడుకలను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో కేక్ కట్ చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నరేష్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎంపీ సురేష్ షేట్కార్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, జహీరాబాద్ ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కౌన్సిలర్లు మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ జమిల్, మాజీ వైస్ చైర్మన్ ఖాజా



మియా, కౌన్సిలర్ ప్రతినిధులు, సీనియర్ నాయకులు అశోక్ అలీపూర్, మార్కెట్ డైరెక్టర్ శేఖర్, మొయిజ్ లష్కరి, అయూబ్ సహారా, మహమ్మద్ జహీర్, మహమ్మద్ సోహైల్ తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సర్ పై బీజేపీ సమాలోచన

- అక్రమ ఓట్ల నమోదును అడ్డుకోవాలని పిలుపు
- హైదరాబాద్‌లో బీజేపీ సన్నాహక సమావేశం
- రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన భేటీ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు
- ఇంటింటికీ వెళ్లాలని కార్యకర్తలకు సూచన
- అక్రమ ఓట్ల నమోదుపై అప్రమత్తంగా ఉండాలి
- ఓటు బ్యాంకు రాజకీయాలకు చెక్ పెట్టాలి
- పట్టుదలతో పనిచేయాలని నేతల పిలుపు





**రాజేంద్రనగర్ వెలుతురు ఆగస్టు 08:**

హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సర్ సన్నాహక సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ నేతలు, ఎంపీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ప్రధానంగా చర్చించారు.అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు దక్కేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఇందుకోసం బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ, వారికి ఓటు హక్కు కల్పించే దిశగా కృషి చేస్తున్నారని పార్టీ నేతలు తెలిపారు.అదే సమయంలో ఓటు బ్యాంకు రాజకీయాల కోసం BRS, కాంగ్రెస్, MIM పార్టీలు అక్రమంగా ఓటర్ల నమోదుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి ప్రయత్నాలను గుర్తించి అడ్డుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో అనర్హుల పేర్లు చేరకుండా, అర్హుల పేర్లు తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడటంతో పాటు అక్రమ ఓట్లను నిలువరించేందుకు పార్టీ శ్రేణులు మరింత పట్టుదలతో పనిచేయాలని నేతలు కోరారు. SIR ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీలు కే. విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావుతో పాటు పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ టాక్స్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె. హుస్సేన్‌వల్లి ఐపీఏ సన్మాన్ 2026 అవార్డును అందుకున్నారు

**నాంప ఆగస్టు 08 ( వెలుతురు) :**



ప్రముఖ ఆదాయపు పన్ను మరియు GST ప్రాక్టీషనర్ శ్రీ కె. హుస్సేన్‌వల్లి వృత్తి రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రాక్టికల్స్ అకౌంటెన్సీ సన్మాన్ 2026 అవార్డును అందజేశారు. హైదరాబాద్ నాంపల్లి లోని ఎఫ్టీసీసీఐలో జరిగిన కార్యక్రమంలో లోకాయుక్త చైర్మన్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును స్వీకరించారు. కె. హుస్సేన్‌వల్లి దశాబ్దానికి పైగా ఆదాయపు పన్ను మరియు GST రంగాల్లో సేవలందిస్తూ, పన్ను చెల్లింపుదారులకు మరియు వ్యాపారవేత్తలకు మార్గదర్శకత్వం అందిస్తున్నారాని ఐపీఏ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తూ, పన్ను నిపుణుల వృత్తి అభివృద్ధి, పన్ను అవగాహన, శిక్షణా కార్యక్రమాలు మరియు సభ్యుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. వృత్తి సేవలతో పాటు లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటూ, సమాజం పట్ల తన బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనం మరియు నిస్వార్థ సేవలను తన జీవిత విలువలుగా స్వీకరించి ముందుకు సాగుతున్నారని పలువురు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా కె. హుస్సేన్‌వల్లి మాట్లాడుతూ ఈ అవార్డు తన సేవలను గుర్తించిన గౌరవంగా భావిస్తున్నానని, ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. భవిష్యత్తులో పన్ను రంగంలో మరింత నాణ్యమైన సేవలు అందించడంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని పేర్కొన్నారు. “సేవే పరమో ధర్మః – సమాజ సేవే నిజమైన సంపద.” అని అన్నారు.



# ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యు ఆర్ విద్యార్థినుల విజయపతాకం

**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 08:**



జూలై 30 నుండి ఆగస్టు 7 వరకు 2026 వరకు ఇటలీలోని గార్డా సరస్సు వద్ద జరిగిన సెయిలింగ్ ఇంటర్నేషనల్ కాడెట్ ప్రపంచ ఛాంపియన్‌షిప్(ప్రమోషనల్ క్లాస్)లో రజత పతకం గెలుచుకున్న ఎం.జె.పి.టి కామారెడ్డి 10వ తరగతి విద్యార్థినీ ఎస్.రిష్విత. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.మాధవి మాట్లాడుతూ విద్యార్థినుల అంకిత భావం , సమయ పాలన, సమిష్టి కృషి తో తెలంగాణకు, భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టారని అన్నారు.ఎం.జె.పి.టి సెక్రటరీ బి. సైదులు గారి ప్రత్యేక కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. సాంకేతిక అంశాలపై శిక్షణ ఇప్పించడం వలన, పోటీలకు విద్యార్థులకు ఎన్నో అవకాశాలను అందించారని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయం మరింతమంది యువ నావికులకు స్ఫూర్తి నిస్తుందని అలాగే మరిన్ని అంతర్జాతీయ విజయాలకు నాంది పలుకుతుందని బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, బి.సి.సంక్షేమ శాఖ కార్యదర్శి సైదులు, ప్రిన్సిపల్ సెక్రటరీ బాల మాయాదేవి, ఆర్ సి ఓ సత్యనాథ్ రెడ్డి, ప్రిన్సిపల్ పి.మాధవి మరియు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# జిలుకర కృష్ణాకర్ గారిని కుల పెద్దగా అధికారికంగా ప్రకటించారు

**బషీర్ బాగ్ వెలుతురు ఆగస్టు 8:**



పాఖాల గ్రామ షెడ్యూల్డ్ కులాల వారంతా సమావేశమై వారి కుల పెద్ద మనిషిగా పురాతన కాలం నుంచి అదే వంశపారపర్యంగా వస్తున్నటు వంటి ఆచారాన్ని పాటిస్తూ కొనసాగిస్తూ కీర్తిశేషులు బాకి యాకయ్య గారి కుమారుడు శ్రీ బాకి మధుసూదన్ గారిని కుల పెద్దమనిషిగా మరియు సారి కోళ్ల మేతరిగా శ్రీ బాకి రవి తండ్రి సోమ నరసయ్య గారిని ఏకగ్రీవంగా వివిధ వంశం వాళ్లు అనగా బాకి వారి కుటుంబీకులు జిలుకర వారి కుటుంబీకులు, గంగదారి వారి కుటుంబీకులు, ఉప్పుగళ్ల వారి కుటుంబీకులు, మచ్చ వారి కుటుంబీకులు, ఆకారపు వారి కుటుంబీకులు కొంగరి వారి కుటుంబీకులు మరియు ఎడెల్లి వారి కుటుంబీకులు, బురుక వారి కుటుంబీకులు, మాదారపు వారి కుటుంబీ కులకు చెందిన పెద్దలంతా కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆనవాయితీగా వస్తున్నటువంటి ఆచారము ప్రకారం ఊరు బైండ్ల కీర్తిశేషులు జిలుకర రామస్వామి కొడుకు శ్రీ జిలుకర కృష్ణాకర్ గారిని కుల పెద్దగా వారందరు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# లండన్ కిడ్స్ తులసి నగర్ స్కూల్లో ఘనంగా బోనాల సంబరాలు

**తులసి నగర్ వెలుతురు ఆగస్టు 08:**

లండన్ కిడ్స్ తులసి నగర్ స్కూల్ యాజమాన్యం ఎం. సతీష్ కుమార్, ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ ఫేస్ 2, తులసి నగర్ 2 లండన్ కిడ్స్ స్కూల్లో ఘనంగా బోనాల సంబరాలు జరిగాయి ఈ కార్యక్రమంలో స్కూల్ కి సంబంధించిన సిబ్బంది మరియు టీచర్లు లక్ష్మి ప్రసన్న, ఝాన్సీ రాణి, నందిని,సంతోషిని, సుధారాణి , రాజేశ్వరి , మరియు యాజమాన్యానికి సంబంధించిన మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు,



# తెలంగాణ రెండవ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 16న ఖమ్మంలో



**హైదరాబాద్ వెలుతురు ఆగస్టు 08:**

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తెలంగాణ రెండవ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 16, 2026న ఖమ్మం వేదిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. “ప్రజాస్వామ్యం – సాంస్కృతిక సంభాషణ” అనే అంశంపై ఈ మహాసభలు నిర్వహించనున్నారు.ఈ మహాసభల సందర్భంగా గోడపత్రం విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం టి.పి.ఎస్.కె. హాల్, బాగ్‌లింగంపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధకులు సాహిత్య విమర్శకులు డా: సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలు, లౌకికత, సమానత్వం, సాంస్కృతిక వైవిధ్యాన్ని పరిరక్షించడంలో రచయితలు, కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలోని భిన్న కులాలు, మతాలు, జాతుల మధ్య సామరస్యపూరిత సహజీవన సంస్కృతిని పెంపొందించే సాహిత్య, సాంస్కృతిక నిర్మాణం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 16న ఖమ్మంలో జరిగే రెండవ రాష్ట్ర మహాసభలకు కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రజాస్వామ్య పరిరక్షణ కై సాగే ఈ సాంస్కృతిక సంభాషణలో భాగం కావడానికి రచయితలను కళాకారులను సమూహ ఆహ్వానిస్తుందని అందరం చేతులు కలుపుదాం గొంతులు ఏకం చేద్దాం ఎప్పటికైనా ప్రజలు ఎగరేసే స్వేచ్ఛ గీతాల కోసం విశాలమైన ఆకాశాన్ని సిద్ధం చేద్దాం ఈ మహాసభలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే భూపతి వెంకటేశ్వర్లు సమూహ కన్వీనర్ డాక్టర్ రాపోలు సుదర్శన్,కల్యాణి కుంజ, రచయిత్రి రూప రుక్మిణీ , సమూహ కన్వీనర్ ఎ.కె ప్రభాకర్,బమ్మిడి జగదీశ్వర రావు, ఎం.శ్యామల, భూపతి వెంకటేశ్వర్లు సమూహ కన్వీనర్

# తపోవన్ ద స్కూల్ బహదూర్ పల్లి లో ఘనంగా బోనాల సంబరాలు

**బహదూర్ పల్లి వెలుతురు ఆగస్టు 08:**

తపోవన ద స్కూల్ బహదూర్ పల్లి యాజమాన్యం ఎం. సతీష్ కుమార్, ఆధ్వర్యంలో వాయుపుత్ర కాలనీ బహదూర్ పల్లి లో ఘనంగా బోనాల సంబరాలు జరిగాయి ఈ కార్యక్రమంలో స్కూల్ కి సంబంధించిన సిబ్బంది మరియు టీచర్లు నందిని, సబిత, సౌమ్య ,భవాని, మాధవి, మల్లిక, దీపిక ,మేఘన యాజమాన్యానికి సంబంధించిన మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.





# ఆషాఢ మాస బోనాల సందర్భంగా రేపు ఆగస్టు 9న ప్రముఖ ఆలయాల్లో ప్రభుత్వ తరుపున పట్టు వస్త్రాల సమర్పణ

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 8:**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 9న హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని పలు ప్రముఖ అమ్మవారి ఆలయాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

**ప్రముఖ ఆలయాల్లో ప్రభుత్వ ప్రతినిధులుగా పట్టు వస్త్రాలు సమర్పించే ముఖ్య నేతల వివరాలు:**

- ఉప్పుగూడ శ్రీ మహంకాళి ఆలయం – శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనమండలి చైర్మన్
- మీరాలం మండి శ్రీ మహంకాళి ఆలయం – శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ స్పీకర్
- లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయం – మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్,శ్రీ కొండా సురేఖ
- కార్వాన్ శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం – శ్రీ దామోదర రాజనర్సింహ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి
- సుల్తాన్‌షాహి శ్రీ బంగారు మైసమ్మ ఆలయం – శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి
- హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న ఆలయం – శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి
- చిలకలగూడ శ్రీ కట్ట మైసమ్మ ఆలయం – శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి
- అంబర్‌పేట శ్రీ మహంకాళి ఆలయం – శ్రీమతి దనసరి అనసూయ సీతక్క, మంత్రి
- సబ్జీ మండి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం – శ్రీ తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి
- రాంబక్షబండ శ్రీ బంగారు మైసమ్మ ఆలయం – శ్రీ జూపల్లి కృష్ణారావు, మంత్రి
- భేలా శ్రీ ముత్యాలమ్మ ఆలయం – శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి
- సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ ఆలయం – శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రి
- గౌలిపూర శ్రీ మహంకాళి ఆలయం – శ్రీ వాకిటి శ్రీహరి, మంత్రి
- హరిబౌలి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం – శ్రీ వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు
- హరిబౌలి శ్రీ బంగారు మైసమ్మ ఆలయం – శ్రీ వి. హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు
- బోయిగూడ శ్రీ బంగారు మైసమ్మ ఆలయం – శ్రీ కె. కేశవరావు, శ్రీ అద్దంకి దయాకర్, ప్రభుత్వ ప్రతినిధులు
- నాచారం శ్రీ మహంకాళి సమేత మహంకాళేశ్వర ఆలయం – శ్రీ పి. సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు
- గౌలిగూడ శ్రీ మహంకాళి ఆలయం – శ్రీ హర్కర వేణుగోపాల్ రావు, ప్రభుత్వ సలహాదారు
- ఎల్‌బీనగర్ శ్రీ ఖిల్లా మైసమ్మ ఆలయం – శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి, శ్రీ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్‌లు
- అలీజాకోట శ్రీ మహంకాళి ఆలయం – శ్రీ విజయ రమణారావు, ప్రభుత్వ సలహాదారు/ఎమ్మెల్యే
- మూసీ బ్రిడ్జి శ్రీ భూలక్ష్మి ఆలయం – శ్రీ పట్నం మహేందర్ రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్
- నట్రాజ్ నగర్ శ్రీ మహంకాళి ఆలయం – శ్రీ బాల్మూరి వెంకట్, ప్రభుత్వ విప్
- అలియాబాద్ శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం – శ్రీ జాతోత్ రామ్‌చందర్ నాయక్, ఉప సభాపతి
- మురాద్ మహల్ శ్రీ నల్ల పోచమ్మ ఆలయం – డా. బండా ప్రకాశ్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్
- సీబీఐ క్వార్టర్స్ శ్రీ నల్ల పోచమ్మ ఆలయం – శ్రీ ఎం. అనిల్ కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు
- చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి ఆలయం – శ్రీ బి. మహేష్ కుమార్ గౌడ్, శాసనమండలి సభ్యుడు
- ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. అమ్మవార్లకు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ భక్తుల విశ్వాసాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది..

# పెద్దల ఆశీర్వాదాలతో ప్రజా సేవలో మరింత అంకిత భావంతో ముందుకు సాగుతా: భీమ లక్ష్మణ్ ముదిరాజ్

- **పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిల ఆశీర్వాదం పొందిన భీమ లక్ష్మణ్ ముదిరాజ్**

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 8:**



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, 2018 జనగామ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే భీమ లక్ష్మణ్ ముదిరాజ్ తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రంలోని గౌరవనీయులైన పెద్దలను కలిసి వారి ఆశీర్వాదాలు, ఆత్మీయ అభినందనలు స్వీకరించారు.ఈ సందర్భంగా గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మాన్యశ్రీ రేవంత్ రెడ్డి అన్నగారిని, గౌరవ రాష్ట్ర మంత్రి మాన్యశ్రీ వాకిటి శ్రీహరి ముదిరాజ్ అన్నగారిని, గౌరవ రాజ్యసభ సభ్యులు మాన్యశ్రీ వేం నరేందర్ రెడ్డి అన్నగారిని, భువనగిరి పార్లమెంట్ సభ్యులు మాన్యశ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నగారిని కలిసి పుట్టినరోజు సందర్భంగా వారి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా తనను ఎంతో ఆప్యాయంగా పలకరించి, ప్రేమతో హత్తుకుని ఆశీర్వదించిన ముఖ్య మంత్రి గారు, మంత్రి గారు, రాజ్యసభ సభ్యులు మరియు ఎంపీ గారికి భీమ లక్ష్మణ్ ముదిరాజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు."నా రాజకీయ, ప్రజా జీవితంలో పెద్దల ఆశీర్వాదం, మార్గదర్శకత్వం నాకు ఎల్లప్పుడూ కొండంత బలం. ఈరోజు నా పుట్టినరోజు సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నగారు, మంత్రి వాకిటి శ్రీహరి అన్నగారు, వేం నరేందర్ రెడ్డి అన్నగారు, చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నగారు చూపించిన ప్రేమ, ఆప్యాయత, ఆశీర్వాదాలు నాకు మరింత బాధ్యతను గుర్తుచేశాయి. వారి ఆశీస్సులతో ప్రజల కోసం మరింత అంకితభావంతో పనిచేస్తాను" అని భీమ లక్ష్మణ్ ముదిరాజ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజా సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.తనపై ఎల్లప్పుడూ చూపిస్తున్న పెద్దల ప్రేమ, ఆప్యాయత, నమ్మకం మరియు ఆశీర్వాదాలు భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానని భీమ లక్ష్మణ్ ముదిరాజ్ అన్నారు. పెద్దల ఆశీర్వాదం – ప్రజల ప్రేమ – కాంగ్రెస్ సిద్ధాంతం... ప్రజా సేవే తన జీవిత ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.

# ప్రతి పుట్టినరోజుకు ఒక మొక్క

- **ఆదర్శంగా నిలుస్తున్న విశ్రాంత ఉద్యోగి మర్రి ఆనందం**

**మోత్కూర్, ఆగష్టు 08,వెలుతురు :**



రిటైర్డ్ ఎంప్లాయిస్ మోత్కూర్ యూనిట్ పూర్వ మండల అధ్యక్షులు మర్రి ఆనందం తన ప్రతి పుట్టినరోజు నాడు కచ్చితంగా ఒక మొక్కను నాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. వ్యవసాయ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఈ ప్రకృతి ప్రేమికుడు తన ముప్పై యవ ఏట నుండి ప్రతి పుట్టినరోజు రోజు నాడు ఒక మొక్కకు నాటుతున్నట్లు తెలిపాడు.ప్రకృతి మనకు ఎంతో ఇచ్చింది మనం ప్రకృతికి ఋణపడి ఉన్నామని అందరూ తమ తమ పుట్టి నరోజుల నాడు ఒక మొక్కను నాటితే కొంత వరకైనా ప్రకృతి సమతుల్యతను సాధించవచ్చని ఆకాంక్షించారు. యధాతదంగా తన 75 వ పుట్టినరోజు సందర్భంగా శనివారం నాడు మోత్కూర్ ముత్యాలమ్మ తల్లీ ఆలయ ప్రాంగణంలో రావి, వేప మొక్కలను నాటారు. వీరి ఆత్మీయులు శాలువాతో ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమటి మత్స్యగిరి, పట్టూరి అంజయ్య, గుంటి లక్ష్మయ్య, నర్సింహా చారి ఉన్నారు.

# డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన చెందవద్దు

- **నోటీసు అందిన ఓటర్లు మాత్రమే సంబంధిత AEROలకు అవసరమైన పత్రాలు సమర్పించాలి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు ఆగస్టు 08:**

రంగారెడ్డి జిల్లా పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR–2026) ప్రక్రియలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు కనిపించని లేదా సంబంధిత కారణాలతో నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది.నోటీసు జారీ చేయడం అనేది ఓటరు పేరు తుది ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు కాదని, సంబంధిత ఓటరు తన అర్హతను నిరూపించుకునేందుకు అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అవకాశం కల్పించడమేనని అధికారులు తెలిపారు.నోటీసులు అందుకున్న ఓటర్లు మాత్రమే తమకు వర్తించే పత్రాలలో సంబంధిత పత్రం యొక్క స్వయంగా ధృవీకరించిన (Self–Attested) ప్రతిని సంబంధిత

- AERO (Assistant Electoral Registration Officer)*కు సమర్పించాలని సూచించారు.

**సమర్పించగల పత్రాలు**

- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థల్లో (PSU) పనిచేసే ఉద్యోగి/పెన్షనర్‌కు జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా Pension Payment Order (PPO).
- 01.07.1987కు ముందు భారత దేశంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు, బ్యాంకులు, పోస్టాఫీసు, LIC లేదా ప్రభుత్వ రంగ సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డు/ధృవీకరణ పత్రం/ఇతర అధికారిక పత్రం.
- సంబంధిత అధికార సంస్థ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం (Birth Certificate).

**పాస్‌పోర్ట్**

- గుర్తింపు పొందిన విద్యా బోర్డులు/విశ్వ విద్యాలయాలు జారీ చేసిన మెట్రిక్యులేషన్/విద్యా ధృవీకరణ పత్రం.
- సంబంధిత రాష్ట్ర అధికార సంస్థ జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం (Permanent Residence Certificate).
- అటవీ హక్కుల ధృవీకరణ పత్రం (Forest Rights Certificate).
- సంబంధిత అధికార సంస్థ జారీ చేసిన OBC/SC/ST లేదా ఇతర కుల ధృవీకరణ పత్రం.
- వర్తించే చోట *National Register of Citizens (NRC)*కు సంబంధించిన పత్రాలు.
- చట్టం/పరిపాలనా నిబంధనల ప్రకారం ప్రభుత్వ అధికారులు నిర్వహించే Family Register.
- ప్రభుత్వం జారీ చేసిన భూమి/ఇంటి కేటాయింపు ధృవీకరణ పత్రం.
- ఆధార్‌కు సంబంధించి, భారత ఎన్నికల సంఘం 09.09.2025న జారీ చేసిన లేఖ నం. *23/2025-ERS/Vol.II (Annexure-II)*లో పేర్కొన్న మార్గదర్శకాలు వర్తిస్తాయి.
- జనన తేదీ ఆధారంగా సమర్పించాల్సిన పత్రాలు
- 01.07.1987కు ముందు భారత దేశంలో జన్మించిన వారు:
- తమ జనన తేదీ మరియు/లేదా జన్మస్థలాన్ని నిర్ధారించే పై జాబితాలోని ఏదైనా ఒక పత్రాన్ని సమర్పించాలి.
- 01.07.1987 నుంచి 02.12.2004 మధ్య భారతదేశంలో జన్మించిన వారు:
- తమ జనన తేదీ మరియు/లేదా జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రంతో పాటు, తండ్రి లేదా తల్లి జనన తేదీ/జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రాన్ని కూడా సమర్పించాలి.
- 02.12.2004 తర్వాత భారతదేశంలో జన్మించిన వారు:
- తమకు సంబంధించిన పత్రంతో పాటు తండ్రి మరియు తల్లి జనన తేదీ/జన్మస్థలాన్ని నిర్ధారించే పత్రాలను సమర్పించాలి. తల్లిదండ్రుల్లో ఎవరైనా భారతీయ పౌరులు కాకపోతే, వారి జనన సమయంలో చెల్లుబాటులో ఉన్న పాస్‌పోర్ట్, వీసా ప్రతులను సమర్పించాలి.
- భారతదేశం వెలుపల జన్మించిన వారు:
- విదేశాల్లోని భారత రాయబార కార్యాలయం/మిషన్ జారీ చేసిన జనన నమోదు ధృవీకరణకు సంబంధించిన ఆధారాన్ని సమర్పించాలి.
- రిజిస్ట్రేషన్/నేచురలైజేషన్ ద్వారా భారతీయ పౌరసత్వం పొందిన వారు:
- భారతీయ పౌరసత్వ నమోదు ధృవీకరణ పత్రం (Certificate of Registration of Citizenship) సమర్పించాలి.
- నోటీసు అందిన వారికి మాత్రమే పత్రాల సమర్పణ
- డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోయిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది. సంబంధిత AERO నుంచి నోటీసు అందుకున్న ఓటర్లు మాత్రమే, నోటీసులో సూచించిన విధంగా అవసరమైన పత్రాలను సమర్పించాలి.
- నోటీసు అందినంత మాత్రాన ఓటరు పేరు తొలగించబడినట్లు భావించ రాదని, సంబంధిత పత్రాలను నిర్ణీత విధానంలో సమర్పించి తమ అర్హతను



నిర్ధారించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

- అందువల్ల నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా, నోటీసులో పేర్కొన్న సూచనల ప్రకారం సంబంధిత AEROను సంప్రదించి అవసరమైన పత్రాలను సమర్పించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం సూచించింది.
- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, పారదర్శకంగా మరియు నిబంధనలకు అనుగుణంగా SIR–2026 ప్రక్రియను నిర్వహించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.

# పంట కాలువలో మురుగు.. కడియం శ్రీహరి ఆగ్రహం

- కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే
- మురుగు నీరు చేరకుండా చర్యలు
- వెంటనే పూడికతీత చేపట్టాలని ఆదేశం
- శాశ్వత కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు
- 2,500 ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ఆగస్టు 14న నీటి విడుదల

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**



స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సాగునీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ కుడి కాలువతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలను నీటిపారుదల, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువలోకి మురుగు నీరు చేరుతున్న పరిస్థితిని చూసి ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.మున్సిపాలిటీ ఎస్సీ కాలనీ నుంచి వెళ్లే పంట కాలువ, తూము ప్రాంతం, పరిసర కాలనీల్లో కాలువల పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కడియం శ్రీహరి పరిశీలించారు. పట్టణంలోని డ్రైనేజీ నీరు పంట కాలువలో కలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సాగునీటి కాలువలను మురుగునీటి ప్రవాహానికి ఉపయోగించకుండా ప్రత్యామ్నాయ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.ప్రస్తుతం రైతులకు వీలైనంత త్వరగా నీటిని అందించేందుకు కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించాలని, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను కడియం శ్రీహరి ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో ఈ పనులు పూర్తి చేసి సాగునీరు చివరి ఆయకట్టుకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కాలువకు ఇరువైపులా సైడ్ వాల్స్ నిర్మించి నీరు వృథా కాకుండా చివరి భూముల వరకు చేరేలా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను మూడు నెలల్లో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీలు, వరద కాలువలు, పంట కాలువల వ్యవస్థలను పరస్పర సమన్వయంతో అభివృద్ధి చేయాలని మున్సిపల్, నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు.దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా 1.5 టీఎంసీల సామర్థ్యంతో ఘనపూర్ రిజర్వాయర్‌ను నిర్మించారని కడియం శ్రీహరి తెలిపారు. దీని కింద సుమారు 2,500 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ కాలువల ఆధునికీకరణ పూర్తికాకపోవడంతో ఆశించిన స్థాయిలో నీరు చేరడం లేదని చెప్పారు.రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆరుతడి పంటలకూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్లు తెలిపారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ సాగునీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ధర్మసాగర్, స్టేషన్ ఘనపూర్, అశ్వారావుపల్లి, గండి రామారం, నవాబ్‌పేట రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచి.. అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కడియం శ్రీహరి వెల్లడించారు. ఇందులో భాగంగా ఆగస్టు 14న నియోజకవర్గంలోని అన్ని రిజర్వాయర్ల నుంచి సాగునీటిని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈలు, డీఈలు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంజారాహిల్స్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 11 మందికి త్రుటిలో తప్పిన ముప్పు
- రోడ్ నంబర్ 10లోని భవనం సెల్లార్‌లో చెలరేగిన మంటలు
- సెల్లార్‌లో వైన్‌షాప్ గోదాం నిర్వహిస్తున్నట్లు గుర్తింపు
- సమాచారం అందగానే రంగంలోకి దిగిన అగ్నిమాపక, హైడ్రా సిబ్బంది
- భవనంలో చిక్కుకున్న 11 మందిని సురక్షితంగా బయటకు తరలింపు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**



హైదరాబాద్ బంజారాహిల్స్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్ నంబర్ 10లోని ఓ భవనం సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

### 11 మందికి తృటిలో తప్పిన ముప్పు

మంటలు, దట్టమైన పొగతో భవనం పరిసరాల్లో భయానక పరిస్థితి నెలకొంది. భవనంలో ఉన్న 11 మందిని అగ్నిమాపక, హైడ్రా సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దీంతో ప్రాణనష్టం తప్పింది. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో నాలుగు అగ్నిమాపక శకటాలను రంగంలోకి దించారు. సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సెల్లార్ నుంచి దట్టమైన పొగ వెలువడటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది.

### సెల్లార్‌లో వైన్‌షాప్ గోదాం

భవనం సెల్లార్‌లో వైన్‌షాప్‌కు సంబంధించిన గోదాంను నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గోదాంలో ఉన్న సామగ్రి కారణంగానే మంటలు వేగంగా వ్యాపించాయా? అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నారు. అగ్ని ప్రమాదానికి అసలు కారణం ఏమిటనేది ఇంకా తెలియరాలేదు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత అధికారులు భవనాన్ని పరిశీలించనున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులతో పాటు జరిగిన ఆస్తి నష్టంపై అంచనా వేయనున్నారు.

# ఆయుధాల కొరతతో ట్రంప్ ఆగ్రహం

- క్షిపణి నిల్వలు తగ్గుతున్నాయన్న కథనాలపై తీవ్ర అసంతృప్తి
- ఇరాన్‌తో కీలక చర్చల సమయంలో ఇలా జరగడంపై అసహనం
- లీకులపై విచారణకు ఆదేశాలు

**వాషింగ్టన్ వెలుతురు, ఆగస్టు 8:**

ఇరాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో అమెరికా ఆయుధ నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయన్న మీడియా కథనాలు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు తీవ్ర అసహనాన్ని కలిగించాయి. ఈ సమాచారం బయటకు రావడంతో అమెరికా బలహీనంగా కనిపిస్తోందనీ, అది ఇరాన్‌తో జరుగుతున్న చర్చల్లో తమ బేరసారాల శక్తిని దెబ్బతీస్తోందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేసినట్టు అమెరికా ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ సమాచారాన్ని లీక్ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన న్యాయశాఖను ఆదేశించారు. అమెరికా మీడియా కథనాల ప్రకారం... ఇటీవల క్యాంప్ డేవిడ్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం ప్రధాన చర్చగా మారింది. క్షిపణుల నిల్వలు తగ్గుతున్నాయన్న వార్తలపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమావేశానికి హాజరైన అధికారులు తెలిపారు. ఆయుధ నిల్వల పరిస్థితి గురించి తనకు ముందే తెలుసనీ, అయితే ఈ సమాచారం ఇరాన్‌తో చర్చలు కీలక దశకు చేరుకున్న సమయంలో బయటకు రావడమే తన ఆగ్రహానికి కారణమని ట్రంప్ పేర్కొన్నట్టు వెల్లడించారు. ఈ కథనాలపై ట్రంప్ సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ... అమెరికా వద్ద భారీ స్థాయిలో ఆయుధ నిల్వలు ఉన్నాయనీ, అవసరమైన ఆయుధాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నామని వివరించడం గమనార్హం.దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా రక్షణ పరిశ్రమలో కొత్త కర్మాగారాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కొన్ని అత్యాధునిక క్షిపణుల నిల్వలు మాత్రం పరిమితంగానే ఉన్నాయని అనంతరం వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ అంగీకరించారు. అదే సమయంలో సాధారణ ఆయుధాలకు మాత్రం కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సమాచారాన్ని బయటకు వెల్లడించిన వారిపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రభుత్వ రహస్యాలను బయటపెట్టిన వారిపై దీర్ఘకాల జైలు శిక్షలు విధించాలని కోరుతూ.. వారిని ”దేశ ద్రోహులు”గా అభివర్ణించారు. ఈ లీకుల వెనుక ఉన్న అధికారులను గుర్తించే బాధ్యతను న్యాయశాఖకు అప్పగించినట్టు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అయితే ఈ వ్యవహారంలో రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్‌సెత్‌ను ట్రంప్ నిందించలేదని అధికారులు స్పష్టం చేశారు. ఆయన పనితీరుపై తాను పూర్తిగా సంతృప్తిగా ఉన్నానని ట్రంప్ మరో పోస్టులో పేర్కొన్నారు. సమస్య మొత్తం సమాచార లీకుల గురించేనని వైట్‌హౌస్ అధికారులు వెల్లడించారు.


### ఆందోళన కలిగిస్తున్న నివేదికలు

ఇటీవల అమెరికా సైనిక ఆయుధ నిల్వలపై వెలువడిన నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. సీఎన్ఎన్ కథనం ప్రకారం... ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి అమెరికా తన థాడ్ క్షిపణుల్లో దాదాపు 80 శాతం, పేట్రియట్ ఇంటర్‌సెప్టర్ క్షిపణుల్లో సుమారు సగం వరకు వినియోగించింది. యుద్ధానికి ముందు అమెరికా వద్ద సుమారు 452 థాడ్ క్షిపణులు, 2,200 ఆధునిక పేట్రియట్ క్షిపణులు ఉన్నట్టు సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ అంచనా వేసింది. ఈ పరిస్థితి అమెరికాతో పాటు గల్ఫ్ దేశాలను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా వైమానిక రక్షణ వ్యవస్థలపైనే ఆధారపడుతున్న సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాలు... ఆయుధ నిల్వలు తగ్గిపోతే ఇరాన్ నుంచి వచ్చే క్షిపణి, డ్రోన్ దాడులను ఎదుర్కోవడం కష్టమవుతుందని అమెరికాతో ఆందోళన వ్యక్తం చేసినట్టు అధికారులు తెలిపారు.

# నేతన్న కడుపు కొడుతున్న కాంగ్రెస్ సర్కారు

- బీజేపీ నిర్ణయాలతో
- చేనేత రంగానికి తీవ్ర అన్యాయం
- శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి
- చేనేత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగలేఖ

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**




రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల కడుపు కొడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలోని నేతన్నల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ హయాంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నేతన్నలకు ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలు కాలేదని తెలిపారు. చేనేత రంగం విషయంలో బీజేపీ–కాంగ్రెస్ వైఖరి ఒక్కటేనని విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలతోనూ నేతన్నలకు తీవ్ర నష్టం జరుగుతున్నదని తెలిపారు. చేనేత రంగానికి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు, హ్యాండీక్రాఫ్ట్స్ బోర్డు, పవర్‌లూమ్ బోర్డులను రద్దు చేయడం, హౌస్ కమ్ వర్క్‌షెడ్ వంటి పథకాలను ఎత్తేయడం, చేనేత ఉత్పత్తులపై ఐదు శాతం జీఎస్టీ విధించడం వంటి నిర్ణయాలు చేనేత రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సూచించారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కలిసి చేనేత రంగాన్ని సంక్షోభం వైపు నెడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా నిలిపేసిందని ఆరోపించారు. ప్రస్తుతం ‘నేతన్న బీమా’ అమలు కావడం లేదనీ, ‘నేతన్నకు చేయూత’ పథకం చెల్లింపులు పూర్తిగా ఆగిపోయాయని వివరించారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు నిలిచిపోయాయనీ, బతుకమ్మ చీరలు, ప్రభుత్వ యూనిఫారాల వంటి ప్రభుత్వ ఆర్డర్లలో నేతన్నలకు గతంలో ఇచ్చిన ప్రాధాన్యతను తగ్గించారని విమర్శించారు. ప్రభుత్వ ఆర్డర్లు అన్ని కమీషన్ల కోసం ప్రయివేట్ సంస్థలకు, వ్యక్తులకు అప్పజెప్తున్నారని తెలిపారు. నేతన్నల కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ ఏమయ్యాయనీ ప్రశ్నించారు. చేనేత భరోసా కింద ప్రతి ఏటా రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.ఆరు వేల సహాయం, రూ.లక్ష వరకు వ్యక్తిగత రుణమాఫీ, చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాల మాఫీ, కేంద్రం విధిస్తున్న ఐదు శాతం జీఎస్టీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. రెండున్నరేండ్లు గడిచినా నేతన్నలకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని తెలిపారు. ‘నేతన్న బీమా’, ‘నేతన్నకు చేయూత’ పథకాలను వెంటనే ప్రారంభించి బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోసపూరిత వైఖరిని వీడి నేతన్నల కుటుంబాలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# హైడ్రా ఉద్యోగాల కోసం భారీగా తరలివచ్చిన యువత

- సరూర్‌నగర్‌లో ఉద్రిక్తత.. ఉద్యోగాల కోసం స్టేడియం వద్దకు చేరుకున్న నిరుద్యోగులు
- ఉదయం నుంచే దరఖాస్తుదారుల క్యూ లైన్లు
- సమయం గడిచేకొద్దీ పెరిగిన అభ్యర్థుల సంఖ్య
- స్టేడియం పరిసరాల్లో తీవ్ర రద్దీ
- ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**



నిరుద్యోగులు దరఖాస్తు ప్రక్రియ కోసం వేచి చూశారు.

హైదరాబాద్ ఎల్బీనగర్ పరిధిలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద హైడ్రా ఉద్యోగాల కోసం యువత భారీగా తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు స్టేడియం వద్దకు చేరుకున్నారు. సమయం గడిచేకొద్దీ అభ్యర్థుల సంఖ్య భారీగా పెరగడంతో స్టేడియం పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

### భారీగా పెరిగిన క్యూ లైన్లు

హైడ్రాలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన యువత పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో నిల్చున్నారు. ఒక్కసారిగా భారీగా అభ్యర్థులు తరలిరావడంతో స్టేడియం పరిసరాల్లో రద్దీ పెరిగింది. ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న

### నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్

హైడ్రాలో ఉద్యోగాల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. దరఖాస్తుల స్వీకరణకు ఆన్‌లైన్ విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. భారీగా అభ్యర్థులు తరలిరావడంతో దరఖాస్తు ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

### అప్రమత్తమైన పోలీసులు

యువత పెద్ద సంఖ్యలో స్టేడియం వద్దకు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్టేడియం వద్ద భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీని నియంత్రించేందుకు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. హైడ్రా ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మంది అభ్యర్థులు వచ్చే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. స్టేడియం పరిసరాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

# మద్యం మత్తులోనే సూసైడ్ నోట్ రాశాను

- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో మరో ట్విస్ట్.. మాయమైన ఐఫోన్
- మద్యం మత్తులో రాశానన్న ఉదయ్
- నోట్ ఇప్పుడు ఎక్కడుందో తెలియదని వెల్లడి
- ఆధారాలు ఐఫోన్‌లో ఉన్నాయన్న వాదన
- ఫోన్ కూడా కనిపించకపోవడంతో అనుమానాలు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**



ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో దర్యాప్తు కొత్త మలుపు తిరిగింది. ఆయన రాసినట్లు ప్రచారంలోకి వచ్చిన సూసైడ్ నోట్, అందులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని చెబుతున్న ఐఫోన్ ఇప్పుడు దర్యాప్తులో కీలకంగా మారాయి. ఈ రెండు అంశాలపై పోలీసులు దృష్టి సారించడంతో కేసులో మరిన్ని అనుమానాలు తెరపైకి వచ్చాయి.సూసైడ్ నోట్ వ్యవహారంపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉదయ్ కృష్ణారెడ్డిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. తాను మద్యం మత్తులో ఉన్న సమయంలో ఆ నోట్ రాసినట్లు ఉదయ్ చెప్పినట్లు సమాచారం. అయితే ప్రస్తుతం ఆ సూసైడ్ నోట్ తన వద్ద లేదని, అది ఎక్కడ ఉందో కూడా తెలియదని ఆయన పోలీసులకు చెప్పినట్లు తెలుస్తోంది.అయితే నోట్‌లో తాను ప్రస్తావించిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ఐఫోన్‌లో భద్రపరిచినట్లు ఉదయ్ చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ఫోన్ కోసం పోలీసులు ఆరా తీశారు. కానీ ఉదయం నుంచే ఆ ఐఫోన్ కనిపించకుండా పోయినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో నోట్ ఎలా బయటకు వచ్చింది? దాన్ని ఎవరు బయటపెట్టారు? అనే ప్రశ్నలు పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారాయి.సూసైడ్ నోట్ మీడియాకు ఎలా చేరిందనే విషయంపై సీపీ సజ్జనార్ ప్రశ్నించగా ఉదయ్ నుంచి స్పష్టమైన సమాధానం రాలేదని సమాచారం. దీంతో నోట్ బయటకు వచ్చిన విధానం, దాని వెనుక ఎవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక ఆరోపణలకు సంబంధించిన కేసు నమోదైన మరుసటి రోజే ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వార్తలు వచ్చాయి. అయితే అధిక మోతాదులో మద్యం సేవించడంతో ఎక్కువసేపు మత్తులో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. అనంతరం దర్యాప్తులో ఆయనకు మరో ఇద్దరు మహిళలతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.తాజాగా ఉదయ్ కృష్ణారెడ్డి సోదరుడి పాత్రపైనా దర్యాప్తు సంస్థలు దృష్టి సారించినట్లు సమాచారం. సాంకేతిక ఆధారాల ఆధారంగా అతడిని కూడా కేసులో నిందితుడిగా చేర్చే అవకాశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా.. సూసైడ్ నోట్ నిజంగానే ఉదయ్ రాశారా? లేక దర్యాప్తును ప్రభావితం చేసేందుకు ముందస్తు ప్రణాళికలో భాగంగా దాన్ని ఉపయోగించారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. నోట్ మీడియాకు చేరిన విధానంపైనా దృష్టి పెట్టారు. ఈ అంశాలపై మరింత స్పష్టత కోసం ఉదయ్ కృష్ణారెడ్డిని మరోసారి కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాలని పోలీసులు కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణలో కాంగ్రెస్ క్షేత్రస్థాయి పట్టును బలోపేతం చేసేందుకు గంప వేణుగోపాల్ సంఘటన్ సృజన్ అభియాన్ (SSA) ఛైర్మన్‌గా నియమితులయ్యారు

**హైదరాబాద్, వెలుతురు ఆగస్టు 08:**

గంప వేణుగోపాల్ తక్షణమే సంఘటన్ సృజన్ అభియాన్ (SSA) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని SSA కి సంబంధించి కార్యకలాపాల సమన్వయం, పర్యవేక్షణ మరియు అమలుకు నాయకత్వం వహించడం. సంస్థాగత నిర్మాణం, క్రమశిక్షణ మరియు క్షేత్రస్థాయి అమలును బలోపేతం చేయడమే ఈ నియామకం యొక్క లక్ష్యం. గంప వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీకి 30 ఏళ్లకు పైగా అంకితభావంతో సేవలందించిన అనుభవం ఉంది. 16 ఏండ్ల వయసు నుండి సిద్దిపేట డిగ్రీ కాలేజ్ NSUI అధ్యక్షుని గా ప్రారంభం ఐ వివిధ దేశాల్లో టీపీసీసీ ఎన్నారై సెల్ స్థాపన లో కీలకంగా పని చేస్తూ కాంగ్రెస్‌లో కీలక పాత్రలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీజేఏసీ ఎన్నారై సెల్ ఛైర్మన్ గా చురుకుగా పాల్గొని, క్షేత్రస్థాయిలో బలమైన పట్టును ప్రదర్శించారు. విద్యాపరంగా మూడు మాస్టర్స్ డిగ్రీలు సాధించారు. సీనియర్ నాయకత్వం మార్గదర్శకత్వంలో తెలంగాణలో SSA కార్యక్రమాలను నిరంతరం ముందుకు నడిపిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, గౌరవనీయ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ మరియు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ గారి నాయకత్వంలో పనిచేయడం. క్షేత్రస్థాయి సమీకరణను వేగవంతం చేయడం మరియు అన్ని సంస్థాగత స్థాయిలలో సమన్వయాన్ని మెరుగుపరచడం దీని లక్ష్యం.



# “లయన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు 2025–26”తో లయన్ కె. యాదయ్య గౌడ్ ఘన సత్కారం

**హైదరాబాద్వెలుతురు ఆగస్టు 08:**



లయన్స్ డిస్ట్రిక్ట్ 320ఏ లో గ్లోబల్ ఎక్స్‌టెన్షన్ టీమ్ (GET) కోఆర్డినేటర్‌గా విశిష్ట సేవలందిస్తూ, లయనిజం అభివృద్ధి మరియు విస్తరణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన లయన్ కె. యాదయ్య గౌడ్ గారికి ప్రతిష్ఠాత్మకమైన “లయన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు 2025–26” లభించింది.లయన్స్ డిస్ట్రిక్ట్ 320ఏ లో కొత్త లయన్స్ క్లబ్‌ల ఏర్పాటు, సభ్యత్వ విస్తరణ, నాయకత్వ అభివృద్ధి, కొత్త సభ్యులను లయనిజం వైపు ఆకర్షించడం వంటి కార్యక్రమాల్లో ఆయన చూపిన అసాధారణమైన చొరవ, అంకితభావం, నాయకత్వ ప్రతిభ మరియు నిరంతర కృషికి గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం, డాక్టర్ గడ్డం మహేంద్ర కుమార్ రెడ్డి, 2025–26, గవర్నర్ అందజేశారు.GET కోఆర్డినేటర్‌గా లయన్ కె. యాదయ్య గౌడ్ కొత్త క్లబ్‌ల ఏర్పాటును ఒక బాధ్యతగా మాత్రమే కాకుండా, “లయనిజాన్ని మరింత విస్తరించి... మరింత మంది చేత సేవ చేయించాలి” అనే మహోన్నత లక్ష్యంతో ముందుకు తీసుకెళ్లారు. కొత్త క్లబ్‌ల ఏర్పాటుకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ, సభ్యులను ప్రోత్సహిస్తూ, క్లబ్ నాయకులను సమన్వయం చేస్తూ జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. నా సేవలు గుర్తించి నన్ను ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేసిన డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు.

# కుక్కింగ్ అయిల్ ఏది మంచిది



## కల్తీ నూనే గుర్తించడం ఎలా ?

మనం ఏ వంట వండిన అందులో నూనెను తరచు ఉపయోగిస్తుంటాం. నూనె లేనిదే రుచికరమైన వంటచేడం సాధ్యం కాదు. అందుకే వంట నూనె ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్న సామాన్యులు వాటిని వినియోగించక తప్పదు ఇలా వంటనూనెకు ఉన్న డిమాండ్ కారణంగా ఈ మధ్య కాలంలో కల్తీ నూనెలు మార్కెట్లో వస్తున్నాయి. ఇలాంటి నునెను వాడి అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారు. తక్కువ ధరకు దొరికే కొన్నిరకాల కల్తీ నూనెలు జనాన్ని అనారోగ్యాల బారిన పడేస్తున్నాయి. అందుకే దీనిపై 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా' కొన్ని సూచనలు చేసింది. అవేంటంటే.. కల్తీ అనేది ఇటీవల ఎక్కువగా కనిపిస్తున్న సమస్య. ఆహార కల్తీ వల్ల చాలామంది వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా కల్తీ నూనెల ఎఫెక్ట్ ఆరోగ్యంపై ఎక్కువగా ఉంటుంది. అందుకే మనం వాడే నూనెలో కల్తీ ఉందా..? లేదా అనేది తెలుసుకోవడం ముఖ్యం. ఇంట్లోనే చిన్నపాటి ట్రిక్ వల్ల వంటల్లో నూనె కల్తీదా..? కాదా? అనేది తెలుసుకోవచ్చు. దీనికి సంబంధించిన వీడియోను 'ఫుడ్ సెఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా' ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసింది. వంటనూనెల్లో 'ట్రై ఆర్థో క్రెసిల్ ఫాస్ఫేట్' అనే రసాయనాన్ని ఉపయోగించి కల్తీ చేస్తున్నారు. ఇది ప్రధానంగా ఫాస్పరస్‌ను కలిగిన పెస్టిసైడ్. ఇది వాడడం వల్ల నాడీవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి పక్షవాతం లాంటి రోగాలకు దారితీస్తుంది. అయితే మనం వాడే వంటనూనెలో ఏది స్వచ్ఛమైనది, ఏది కల్తీదో అనేది ఓ చిన్న ప్రయోగం ద్వారా తెలుసుకోవచ్చు. ముందుగా రెండు మి.లీ. నూనెను రెండు చిన్న పాత్రల్లోకి తీసుకుని అందులో పసుపు రంగులో ఉన్న వెన్నను వేయాలి. కొద్దిసేపటి తర్వాత పాత్రలోని నూనె రంగు మారకుండా ఉంటే అది స్వచ్ఛమైననూనె అని గుర్తించాలి. అందులో ట్రై-ఆర్థో-క్రెసిల్-ఫాస్ఫేట్ లేదని అర్థం. అదే నూనె రంగు మారి ఎరుపు రంగు మారితే అది కల్తీ అయినట్లు లెక్క.



ఆవ నూనె, అవిశె నూనె, ఆలివ్ ఆయిల్, అవకాడో ఆయిల్, పొద్దు తిరుగుడు నూనె, వేరుసెనగ నూనె, కొబ్బరి, కనోలా, నువ్వుల నూనె... వీటిలో ఏ నూనె వాడాలి అనే ప్రశ్న వచ్చినప్పుడు మనకు ఆప్షన్లు చాలానే కనిపిస్తాయి.కానీ, వీటిలో ఆరోగ్యానికి ఏది మంచిది, ఏది మంచిది కాదు అన్నది తేల్చుకోవడమే అతి పెద్ద సమస్య.నూనెలో మనకు ప్రధానంగా కనిపించే పదార్థం కొవ్వు. ఇందులో మళ్లీ సాచురేటెడ్, మోనో సాచురేటెడ్, పాలి అన్ సాచురేటెడ్ అనే రకాలుంటాయి.కొబ్బరి నూనె ఆరోగ్యానికి మంచిదని చాలామంది నమ్ముతారు. కొందరు దీనిని ‘సూపర్ ఫుడ్’ అని కూడా అంటారు. కొబ్బరి నూనె వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోయే ప్రశ్నే ఉండదంటారు.కానీ ఇటీవల హార్వర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన పరిశోధన దీనిని ప్యూర్ పాయిజన్( స్వచ్ఛమైన విషం)గా తేల్చింది.మానవ శరీరం ఎక్కువ కొవ్వును జీర్ణించుకోలేదు. దీంతో అది శరీరంలో పేరుకు పోతుంది. అలా ఎక్కువగా పేరుకు పోయిన కొవ్వు గుండె జబ్బులు, రక్తపోటులాంటి ఆరోగ్య సమస్యలను సృష్టిస్తుంది.బ్రిటన్ ప్రమాణాల ప్రకారం ఒక పురుషుడు రోజుకు 30 గ్రాములకంటే ఎక్కువ నూనెను తినకూడదు. స్త్రీలయితే 20 గ్రాములే తీసుకోవాలి.నూనెలో ఉండే కొవ్వు ఫ్యాటీ ఆమ్లాల చైన్‌ను ఏర్పరుస్తుంది. ఈ కణాలు సంతృప్త కొవ్వులు(సాచురేటెట్ ఫ్యాట్స్), అసంతృప్త కొవ్వులు(అన్‌సాచురేటెడ్ ఫ్యాట్స్)తో కలిసి రక్తంలో కలిసిపోయి శరీర అవసరాలను తీరుస్తాయి. అయితే ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువైతే అవి నేరుగా కాలేయంలో చేరుతాయి. అప్పుడు రక్తంలో కొలెస్ట్రాల్ పెరుగుతుంది.

## కొబ్బరి నూనె మీద చేసిన ప్రయోగాలు ఏం తేల్చాయి?

కొబ్బరి నూనెపై జరిగిన పరిశోధన ప్రకారం అది మన శరీరంలో తక్కువ సాంద్రత కలిగిన లిపో ప్రొటీన్ (LDL) మొత్తాన్ని పెంచుతుంది. ఈ LDL నేరుగా గుండెపోటుకు కారణమవుతుంది. కొబ్బరి నూనె అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ (HDL)ను కూడా అందిస్తుంది. ఇది రక్తం నుంచి LDLను ఆకర్షిస్తుంది. కొందరు అనుకుంటున్నట్లుగా లారిక్ యాసిడ్ ఆరోగ్యానికి మంచిదికాదని వర్జీనియాలోని జార్జ్‌మాసన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ టేలర్ వాలెస్ అంటారు.“HDLలో లారిక్ యాసిడ్ అనే రసాయనం ఉంటుంది. దీనిని C12 ఫ్యాటీ యాసిడ్ అని కూడా అంటారు. ఇది కాలేయంలో నిల్వ అవుతుంది. దీనివల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి’’ అన్నారు ప్రొఫెసర్ టేలర్.

అందుకే ఇతర ఫ్యాటీ ఆమ్లాలున్నా, సంతృప్త కొవ్వులు తక్కువ ఉన్న పదార్థాలను తినడం మంచిదని నిపుణులు అంటున్నారు.ఒమెగా 3, ఒమెగా 6 ఉండే పాలీ అన్ సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు, తక్కువ కొలెస్ట్రాల్ ఉండే మోనో సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలను తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్లు లభిస్తాయి.పాలీ అన్ సాచురేటెడ్, మోనో సాచురేటెడ్ కొవ్వులతో కూడిన ఫ్యాటీ ఆమ్లాలు చాలా నూనెలలో కనిపిస్తాయి. వాటి పరిమాణం అవి ఏ మొక్క నుంచి లభిస్తున్నాయి, దాని నుంచి నూనెను ఎలా తీస్తున్నారు అన్నదానిపై ఆధారపడి ఉంటుంది.ఆలివ్ ఆయిల్ అధికంగా వాడటం వల్ల గుండె జబ్బుల ప్రమాదం 5 నుంచి 7% తగ్గుతుందని ఒక సర్వేలో తేలింది.అన్నిరకాల ఆలివ్ నూనెలను వాడే ఒక లక్షమందిపై నిర్వహించిన అధ్యయనంలో గుండె జబ్బుల ప్రమాదం వారిలో 15% తక్కువగా ఉన్నట్లు తేలింది’’ అని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన హార్వర్డ్ విశ్వవిద్యాలయం టి.హెచ్.చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ శాస్త్రవేత్త మార్తా గొష్ ఫెర్రె అన్నారు. ఈ పరిశీలన 24 ఏళ్లపాటు సాగిందని ఆమె వెల్లడించారు.ఆలివ్ ఆయిల్ అంత సురక్షితంగా ఉండటానికి అందులో ఉండే మోనో సాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలే కారణమని తేలింది. ఆలివ్ మొక్కలలోని విటమిన్లు, ఖనిజాలు, పాలీఫెనాల్స్, ఇతర సూక్ష్మపోషకాలు నూనెలో కలుస్తాయి.ఆలివ్ నూనె వాడటం వల్ల మన ఆహారం ద్వారా చేరిన ఇతర హానికారక కొవ్వు పదార్థాలు కూడా తొలగిపోతాయని శాస్త్రవేత్త మార్తా అంటారు.

# ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

**హైదరాబాద్, వెలుతురు, ఆగస్టు 8:**

రాష్ట్రంలోని తాగు, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే కనీస అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రాజెక్టుల అంశాన్ని బీఆర్ఎస్ నేతలు తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని తెలిపారు.జూరాల ప్రాజెక్టులో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటితో మొత్తం ఆయకట్టుకు నీటిని అందించడం సాధ్యం కాదని జూపల్లి పేర్కొన్నారు. నీటి లభ్యత, అవసరాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికాబద్ధంగా నీటిని విని యోగించాల్సి ఉంటుందని చెప్పారు. నీటి విషయంలో ప్రభుత్వం బాధ్యతా యుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు.పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై తగిన శ్రద్ధ చూపలేదని జూపల్లి విమర్శించారు. 50 టీఎంసీల సామర్థ్యంతో మల్లన్నసాగర్ ప్రాజెక్టును మాత్రం నిర్మించారని చెప్పారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదని ఆరోపించారు.పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయడానికి సుమారు రూ.80 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని జూపల్లి తెలిపారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై కేవలం రూ.19 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని వివరించారు.అయితే కాల్వలు తవ్వకుండానే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని గత పాలకులు చెప్పడం సిగ్గుచేటని జూపల్లి ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు ద్వారా ప్రయోజనం పొందాల్సిన రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందించేందుకు అవసరమైన పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు.కృష్ణా జలాల్లో తెలంగాణకు 68.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 31.5 శాతం వాటా దక్కాలని జూపల్లి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపులు జరగగా..

ఆమె స్వరం. ఆమె శక్తి.

# ఆమె ఎంపిక – ఆమె ప్రభావం!



నేర్చుకోండి • నాయకత్వం వహించండి • స్ఫూర్తినివ్వండి
సమాజంలో మార్పుకు మార్గదర్శకులు కండి

## కళాశాల విద్యార్థినుల కోసం ప్రత్యేక అవగాహన & నాయకత్వ కార్యక్రమం

మీ ఆసక్తి • మీ అభివృద్ధి • మీ ప్రభావం

ఈ కార్యక్రమంలో పాల్గొనడం పూర్తిగా విద్యార్థినుల స్వచ్ఛంద నిర్ణయం.

### ప్రధాన అంశాలు

**1 మానసిక ఆరోగ్య శ్రేయస్సులో స్నేహ సహాయక (Befriending) నైపుణ్యాలు**
- భావోద్వేగ సహాయం
- ఒత్తిడి నిర్వహణ
- ఆత్మవిశ్వాసం పెంపొందించడం
- స్నేహితులకు సహాయకులుగా మారడం

**2 మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణ – భద్రతా అంశాలు**
- డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన
- స్వీయ రక్షణ
- సహాయం పొందే మార్గాలు
- బాధ్యతాయుత జీవన విధానం

**3 సైబర్ నేరాల నివారణ & సహాయక చర్యలు**
- ఆన్‌లైన్ మోసాల నివారణ
- సోషల్ మీడియా భద్రత
- డిజిటల్ గోప్యత
- సైబర్ హెల్ప్‌లైన సమాచారం

**4 POSH (పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ) అవగాహన**
- మహిళల హక్కులు
- లైంగిక వేధింపులను గుర్తించడం
- ఫిర్యాదు విధానం
- భద్రమైన విద్యా & ఉద్యోగ వాతావరణం

### SPAN Befriending Clubs లో భాగస్వాములు అవ్వండి

మీ విద్యాసంస్థలో ............ స్వయం సమర్థ SPAN Befriending Club ను ఏర్పాటు చేయండి



S.P.A.N. నుండి జీవితంతం హ్యాండ్ హోల్డింగ్ (Hand Holding) మరియు మార్గదర్శక సహాయం అందించబడుతుంది.

- నేర్చుకోండి పెరగండి
- సహకరించండి సహాయం అందించండి
- ప్రేరణ పొందండి మార్పు తీసుకురండి
- కలిసి పని చేసి ప్రభావం చూపండి

| | | | |
|---|---|---|---|
| ఒక్కో బ్యాచ్‌కు గరిష్ఠంగా 40 మంది మాత్రమే (అధికం కాదు) | సమయం 90 నిమిషాలు | ఆసక్తి ఉన్న విద్యార్థినులకు మాత్రమే | LCD ప్రొజెక్టర్ మరియు ఆడియో-విజువల్ సదుపాయాలతో కూడిన పరిశుభ్రమైన, సురక్షితమైన హాల్ అవసరం |

### ఈ కార్యక్రమానికి ఎందుకు హాజరు కావాలి?

- యువతను ప్రభావితం చేస్తున్న ప్రధాన సమస్యలపై అవగాహన
- పాత్రధారణ (Role Plays) ద్వారా పాల్గొనే అభ్యాసం
- మీకు నచ్చిన సామాజిక సేవా రంగాన్ని ఎంపిక చేసుకోవడం
- శిక్షణ పొందిన వాలంటీర్‌గా ఎదగడం
- విద్యా పరిశోధనలకు (Academic Research) ఉపయోగపడే అవగాహన
- సమాజ సేవా కార్యక్రమాలను రూపొందించి అమలు చేసే నైపుణ్యాల అభివృద్ధి



కార్యక్రమ నిర్వాహకుడు
**అశ్విన్ నల్లూరి నాయుడు**
కార్యదర్శి – S.P.A.N.
98491 94366
http://spanindiango.weebly.com

**S.P.A.N.**
Support • Prevent • Act • Now
మానసిక ఆరోగ్యం | అవగాహన | నివారణ | సహాయం
మాదకద్రవ్య రహిత, సురక్షితమైన, మానసికంగా ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి, మనమంతా కలిసికట్టుగా ముందుకు సాగుదాం.

మరిన్ని వివరాలకు QR కోడ్ స్కాన్ చేయండి

మరిన్ని వివరాలకు సంప్రదించండి | అశ్విన్ 98491 94366 s9guru@gmail.com | మరింత సమాచారం కోసం మీ విభాగాధిపతి (HOD) / NSS ప్రోగ్రామ్ అధికారిని సంప్రదించండి.

జాగో... జగావో... షేర్ జాత్తే రహో!

S9 CONSULTING TRUTH AND SERVICE | Social Impact Consultant | Trainer | Civic Activist | సత్యం, నిష్ఠ, కర్తవ్యదీక్షతో మెరుగైన సమాజ నిర్మాణం కోసం.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com